www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!

వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

☎ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 220 | గురువారం | 23 జనవరి, 2025

## రేషన్‌కార్డుదారులకు మరో శుభవార్త



- త్వరలో రేషన్‌షాపుల్లోనే కోడిగుడ్ల పంపిణీ

02

## బేటీ బచావో, బేటీ పడావోకు పదేళ్లు



- ట్విటర్ వేదికగా మోదీ భావోద్వేగం

02

## హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్



- 3.20 లక్షల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు
- విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం

02




# 10వేల కోట్ల పెట్టుబడులు

- ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా
- తెలంగాణ వృద్ధిలో ఈ డేటా సెంటర్ మరో మైలురాయి : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

### కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు

తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో పెట్టుబడుల వేట కొనసాగిస్తోంది. ఇదివరకే యూనిలీవర్, హెచ్‌సీఎల్ లాంటి దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. తాజాగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు చేశారు.

ప్రజానావ,ఖైరతాబాద్:తెలంగాణలో అత్యాధునిక డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు తెలంగాణ బృందంతో భేటీ అనంతరం సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ. 10,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఓవరాల్ గా 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ రూపొందనుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని తెలంగాణ ప్రతినిధులు అంచనా వేశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ

మిగతా 2 లో



# అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ

- పథకాల దరఖాస్తునకు చివరి తేదీ అంటూ ఏమీలేదు
- అపోహలు, తప్పుడు వార్తలను ప్రజలు నమ్మొద్దు
- చివరి లబ్ధిదారుడి వరకు పథకాలను అమలుచేస్తాం
- త్వరలో రేషన్ కార్డుల ద్వారా ఆరు కిలోల సన్నబియ్యం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** 'గ్రామసభల్లో పెట్టే ప్రాథమిక జాబితా మంజూరు పత్రం కాదు.. కేవలం దరఖాస్తుల స్వీకరణ జాబితా మాత్రమే. పథకాలకు అర్హుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ అంటూ ఏమీలేదు. అర్హులైన చివరి లబ్ధిదారుడి వరకు సంక్షేమ పథకాలను అమలుచేస్తాం. అనవసరమైన అపోహలు, తప్పుడు వార్తలను ప్రజలు నమ్మొద్దు' అని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూలతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు,

మిగతా 2 లో

## దావోస్‌లో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

- తెలంగాణ మీన్స్ బిజినెస్' అనే థీమ్‌తో ఏర్పాటు

02

## ప్రజాప్రతినిధులకే రక్షణ లేదు సోయిలేని కాంగ్రెస్ పాలన

దాడి చేసిన వారిపై కాకుండా బాధితులపై కేసులా

ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

03



03

## కన్నెత్తి చూసినా ఊరుకోం

- 60 లక్షలు మంది సైనికులు ఉన్నా పార్టీ బీఆర్ఎస్
- దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాంగ్రెస్‌ది : కవిత

## కావాలనే బీఆర్ఎస్ రాద్ధాంతం



- ప్రజలంతా ఆనందంగా దరఖాస్తు చేస్తున్నారు
- పదేళ్ల తరవాత రేషన్ కార్డులపై ప్రజల్లో ఆనందం
- మంత్రి సీతక్క వెల్లడి

03



## సీఎం వచ్చే వరకు ఆగండి

అక్రమ కట్టడాల కూల్చివేతను అడ్డుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

03



## ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర

- ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

03

# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..




# అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ



మొదటి పేజీ తరువాయి

రైతులకు, రైతు కూలీలకు, నిరుద్యోగులకు , పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం మేలు చేయలేదన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 90లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, గత పదేళ్లలో ఎప్పుడూ ఈ స్థాయిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, గత ప్రభుత్వం కేవలం 40వేల కార్డులు మాత్రం అందించారని అన్నారు. జనవరి 26 నాడు ప్రారంభించి రాష్ట్రంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డు వచ్చే వరకు ప్రక్రియ కొనసాగుతుందని, రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, ప్రజా పాలన కేంద్రాలు, మీ సేవా కేంద్రాలు, గ్రామ సభల్లో దరఖాస్తు ఇచ్చినా విచారించి అర్హత మేరకు కార్డులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామ సభలో ప్రకటించే ప్రాథమిక జాబితాలో పేరు లేని పక్షంలో దరఖాస్తు సమర్పిస్తే అర్హతను పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామన్నారు. ప్రజలు మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రస్తుతం దొడ్డు బియ్యం సరఫరా అవుతున్నాయని, వీటిని చాలా మంది తినడం లేదని, నూతన రేషన్ కార్డుల జారీ తర్వాత ప్రతి ఒక్కరికీ 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

### వంద శాతం ఇండ్లు మంజూరు

ఉమ్మడి రాష్ట్రంలో సాచురేషన్ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించామని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభిస్తున్నామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి ఇక్కడ 100శాతం అర్హులకు మొదటి దఫా లోనే ఇండ్లు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారికి రూ.5 లక్షలు, ఎ స్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షల సహాయం అందిస్తున్నామన్నారు. రైతు భరోసా కింద రైతులకు అందే సహాయం 20 శాతం పెంచి ఎకరానికి రూ.12వేలు అందజేస్తామని, వ్యవసాయ యోగ్యమైన భూమికి పంట వేసినా వేయకుండా రైతు భరోసా అందుతుందన్నారు. ఈ నాలుగు పథకాలను గ్రామసభలు నిర్వహించే ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి జనవరి 26 నుంచి అమలు చేస్తామని, అర్హులైన చివరి వ్యక్తి వరకు లబ్ధి జరుగుతుందని పునరుద్ఘటించారు.

### ఏ ప్రభుత్వం చేయని విధంగా..

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, గ్రామ సభల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. జనవరి 26 నుంచి ప్రారంభించి అర్హత ప్రకారం రేషన్ కార్డులను అందరికీ జారీ చేస్తామని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి గ్రామ ప్రజలు తమ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలని చేసిన కృషి ఫలితంగా నేడు ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. 43, 100 ఎకరాలకు సాగు నీరు అందించే సూరమ్మ ప్రాజెక్టు ను మొదటి ప్రాధాన్యతలో పెట్టామని, ఈ పనులను త్వరలో ప్రారంభం అయ్యేలా చూడాలని ఆయన మంత్రిని విజ్ఞప్తి చేశారు. రుద్రంగి మండలం మానాల లో పాత చెరువు కొత్త చెరువుకు లిఫ్ట్ అందించే త్రాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని , మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందించారు. ప్యాకేజీ 9 లో మలక్ పేట్ రిజర్వాయర్ లో టీఎంసీల నీళ్లు నింపామని, రూ.25 కోట్లు విడుదల చేస్తే అప్పర్ మానేరు కు నీళ్లు తీసుకుని వెళ్ళవచ్చని, ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేయాలని ప్రభుత్వ విప్ కోరారు. వేములవాడ, తిప్పాపూర్, కథలాపూర్ బస్టాండ్ ఆధునికరణ కు నిధులు మంజూరు చేయాలని రవాణా శాఖ మంత్రిని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 103 , రైతు భరోసా కింద 1927, నూతన రేషన్ కార్డుల కోసం 802, ఇందిరమ్మ ఇండ్ల కోసం 1375 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. గతంలో సాంకేతిక కారణాల వల్ల వివరాలు, దరఖాస్తుల సమర్పించని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు పథకాలు అమలుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, కో ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డుదారులకు మరో శుభవార్త

### త్వరలో రేషన్‌షాపుల్లోనే కోడిగుడ్ల పంపిణీ

**హైదరాబాద్, జనవరి 22 :** తెలంగాణలోని రేషన్ కార్డు దారులకు మరో కొత్త శుభవార్త వినిపించనుంది. కోడిగుడ్డులోని పోషక విలువలను దృష్టిలో ఉంచుకొని రేషన్ షాపుల్లో గుడ్లు కూడా పంపిణీ చేయాలని నేషనల్ ఎగ్ చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ (ఎన్ఈసీపీసీ) తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. సాధారణంగా రేషన్ షాపుల్లో పప్పులు, బియ్యం, నూనెలు వంటి నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తుంటారు. అయితే గుడ్డులోని పోషకాల దృష్ట్యా రేషన్ ద్వారా వీటిని కూడా సప్లై చేయాలని ఎన్ఈసీపీసీ చెబుతోంది. ఈ క్రమంలో గుడ్డు ప్రాధాన్యతను, అందులోని పోషక విలువలను వివరిస్తూ కౌన్సిల్ రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ బాలస్వామి, పౌల్ట్రీ ఇండియా వ్యవస్థాపకుడు పొట్లూరి చక్రధర్‌రావు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి 6 గుడ్లు, అంగన్‌వాడీల్లో గర్భిణులకు రోజుకు 2 గుడ్లు, పనికి ఆహార పథకంలో పనిచేస్తున్న వారికి నెలకు 30 గుడ్లు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. ఎన్ని గుడ్లు తిన్నా ఆరోగ్య సమస్యలు రావని, గుడ్డు సంపూర్ణ పౌష్టికాహారమని, కొలెస్ట్రాల్?పెరుగుతుందన్న అపోహను వీడాలన్నారు.?రేషన్ కార్డు ద్వారా ప్రజలకు కూడా నెలకు కనీసం 30 గుడ్లు అందిస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని చెప్పుకొచ్చారు. తగిన పోషకాలు వారికి అందుతాయని వివరించారు. ఈక్విప్ మ్యాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయసింగ్, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ జోనల్ ఛైర్మన్ ఎశేఖర్‌రెడ్డితోపాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక ఎన్ఈసీపీసీ తాజా ప్రతిపాదనపై రేవంత్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్కూళ్లు, అంగన్‌వాడీల్లో విద్యార్థులకు, గర్భిణులకు ప్రభుత్వం ఉచితంగా గుడ్లు అందిస్తుంది. ఒక వేళ సర్కార్ ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందిస్తే రేషన్ కార్డు దారులకు కూడా ఉచితంగా ఇస్తారా? లేదా సబ్సిడీతో పంపిణీ చేస్తారా? అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

## కాళేశ్వరంపై కొనసాగిన విచారణ

### హాజరైన జలవనరుల అభివృద్ధి మాజీ చైర్మన్ ప్రకాశ్

**హైదరాబాద్,జనవరి22 :** కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతోంది. దీనిలో భాగంగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాశ్‌ను కమిషన్ ప్రశ్నించింది. కమిషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అఫిడవిట్ సమర్పించినట్లు వి.ప్రకాశ్ తెలిపారు. ఎవరి మద్దతూ అవసరం లేదని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ఆయనకు బదులిచ్చారు. రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగా పని చేస్తామని చెప్పారు. తమ ముందు ఎవరూ రాజకీయ ఉపన్యాసాలు చేయవద్దన్నారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు ప్రకాశ్ తెలిపారు. స్థిరీకరణకూ ఎక్కువ నీరు అవసరం కాబట్టి చేపట్టారన్నారు. మేడిగడ్డ వద్ద ఆనకట్ట వద్దని ఇంజినీర్ల కమిటీ చెప్పింది కదా అని కమిషన్ ప్రశ్నించింది. విశ్రాంత ఇంజినీర్ల కమిటీ అలా చెప్పలేదని ప్రకాశ్ పేర్కొన్నారు. బొగ్గు గనుల వద్ద సొరంగాలు వద్దన్న సిఫారసును ప్రభుత్వం గౌరవించిందని చెప్పారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకునే కాళేశ్వరం నిర్మించారన్నారు.

## సినీ పరిశ్రమలో ఐటీ సోదాల కలకలం

### తన ఒక్కడి ఇంటిపైనే జరగడం లేదన్న దిల్‌రాజు

**హైదరాబాద్, జనవరి 22:** నగరంలోని పలువురు సినీ ప్రముఖుల ఇళ్లపై జరుగుతున్న ఆదాయ పన్నుశాఖ దాడులపై నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు స్పందించారు. ఐటీ సోదాలు తన ఒక్కడిపైనే జరగడం లేదని అన్నారు. ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాకు అభివాదం చేస్తూ పై వ్యాఖ్యలు చేశారు. రెండో రోజు కూడా సినీ ప్రముఖుల ఇళు ,, కార్యాలయాల్లో ఐటీ శాఖ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దిల్ రాజు నివాసాలు, కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా కార్యాలయాల్లోనూ సోదాలు జరుగు తున్నాయి. నిర్మాణ సంస్థల ఆదాయం, పన్ను చెల్లింపు మధ్య తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పలు సంస్థలకు చెందిన వ్యాపార లావాదేవీల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకర్లను కూడా ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పలు పత్రాలను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు చేశాకే సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 55 బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. సంక్రాంతికి భారీ బ్జడెట్‌తో సినిమాలు తెరకెక్కించిన నేపథ్యంలో దిల్ రాజు నివాసంలో సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం.. సినిమాల నిర్మాణానికి భారీగా వెచ్చించినట్లు చెబుతున్నారు. ఈ రెండు చిత్రాల కలెక్షన్ల నేపథ్యంలో తనిఖీలకు ప్రాధాన్యం సంతరించుకొంది.

## అక్రమ కట్టడాల కూల్చివేత

### అడ్డుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హల్ చల్ చేశారు. జీహెచ్ఎంసీ చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలను ఎమ్మెల్యే అడ్డుకున్నారు. చింతల్ బస్తిలో పలు నిర్మాణాలను అక్రమాలుగా జీహెచ్ఎంసీ గుర్తించింది. అయితే తనకు సమాచారం ఇవ్వకుండా ఎలా చర్యలు తీసుకుంటారని దానం మండిపడ్డారు. కూల్చివేతల ఆపకుంటే జేసీబీ ముందు కూర్చుంటానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌పై, టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అయితే అధికార పార్టీ ఎమ్మెల్యే కూల్చివేతలను అడ్డుకోవడంతో దానం వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిఎం వచ్చే వరకు కూల్చివేతలు ఆపాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ వార్నింగ్ ఇచ్చారు. నోటీసులు లేకుండా ఎలా కూల్చివేతలు చేస్తారు. కూల్చివేతలు ఆపకపోతే లాండ్ ఆర్డర్ ప్రాబ్లం క్రియేట్ చేస్తా. ఎక్కడినుంచో బతకడానికి వచ్చి మమ్మల్ని బతకనివ్వరా? కూల్చివేతల ఆపకపోతే బండి ముందు కూర్చుంటా. నా వెంట వస్తే 100 అక్రమ కట్టడాలు చూపిస్తా.. ముందు అవి కూలకొట్టండి. సీఎం సిటీకి వచ్చిన తర్వాత మాట్లాడతా రెండు రోజులు కూల్చివేతలు ఆపండి' స్టాం÷-రగ్‌గా వార్నింగ్ ఇవ్వడం ఇప్పుడు సంచలనంగా మారింది.

## హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

### 3.20 లక్షల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు

### విస్తరణకు సీఎం ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 22:** ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్‌లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సివిజయకుమార్‌తో చర్చలు జరిపారు. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్‌లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దీంతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉ ద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్‌సీఎల్ గ్లోబల్ నెట్‌వర్క్ సెంటర్ గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్ సేవల విస్తరణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో కొత్త సెంటర్‌ను ప్రారంభించాలని ఆహ్వానించారు. స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలని హెచ్‌సీఎల్ టెక్ ప్రతినిధులను కోరారు. ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని చెప్పారు. 2007 నుంచే హెచ్?సీఎల్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్ లో హెచ్‌సీఎల్ మొత్తం అయిదు సెంటర్లను విస్తరించనుంది.



## 40 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు

### రేణికుంట గ్రామసభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**ప్రజానావ, తిమ్మాపూర్/కరీంనగర్:** రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మందికి రేషన్ కార్డులు అందించనున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారు లను గుర్తించేందుకు తిమ్మాపూర్ మండలం రేణికుంటలో బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన గ్రామసభకు బీసీ సంక్షేమం, రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 40 వేల వరకు రేషన్ కార్డులు ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలలకే 40 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చేందుకు పూర్తిస్థాయిలో సన్నాహాలు చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద అర్హత కలిగిన ప్రతి ఒక్కరి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామసభల్లో వెల్లడించే జాబితాల్లో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయా పథకాల కోసం మళ్లీ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం సాగుతుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తి కాగానే ప్రతీ వ్యక్తికి 6కిలోల సన్నబియ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12వేల రూపాయలు అందించనున్నట్లు వెల్లడించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న నాలుగు ప్రతిష్టాత్మకంగా పథకాల కింద అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. ఆయా పథకాల కింద దరఖాస్తు చేసుకున్న వారు పేర్లు లేవని ఆందోళన చెందవద్దని, మళ్లీ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

### ఏ రాష్ట్రంలో లేనివిధంగా

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 26వ తేదీ నుంచి నాలుగు పథకాలను ఏకకాలంలో అమలుకు శ్రీకారం చుట్టబోతున్నారని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి నాలుగు పథకాలను ప్రారంభించుకోవడం ఏ రాష్ట్రంలోనూ జరగలేదని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ వెలిచాల రాజేందర్ రావు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ లోని హెలిపాడ్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వెలిచాల రాజేందర్ రావ్ సూచించారు. అర్హులైన పేదలందరికీ పథకాలు

## రూ. 10 వేల కోట్ల పెట్టుబడులకు కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు

మొదటి పేజీ తరువాయి

డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కంట్రోల్ ఎస్ వారు నెలకొల్పనున్న ఈ డేటా సెంటర్ మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం తెలంగాణలో పెరుగుఉందని, నగరంలో ఉ పాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణ ఐటీ సేవలలో మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం చేసుకోవడంపై గర్వంగా ఉందన్నారు. యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వంతో చర్చలు జరిపింది. వినియోగ వస్తువుల తయారీలో యూనిలీవర్‌కు మంచి పేరుంది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుతో పాట్ను బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు యూనిలీవర్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆపై టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ సైతం హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకొచ్చింది. 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో 5000 మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

గురువారం
23 జనవరి 2025



# కావాలనే బీఆర్ఎస్ రాద్ధాంతం

- ప్రజలంతా ఆనందంగా దరఖాస్తు చేస్తున్నారు
- పదేళ్ల తరవాత రేషన్ కార్డులపై ప్రజల్లో ఆనందం
- మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్, జనవరి 22:** గ్రామసభల్లో ఆందోళనలు కేవలం బిఆర్ఎస్ కుట్రలతో జరిగినవేనని మంత్రి సీతక్క అన్నారు. అంతటా ప్రశాంతంగా సాగుతున్నాయని, ప్రజలు దరఖాస్తులు అందచేస్తున్నారని అన్నారు. కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభ మయ్యాయి. అయితే గ్రామసభల్లో లబ్దిదారులు ఆందోళనకు దిగారంటూ వస్తున్న వార్తలపై మంత్రి సీతక్క స్పందించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. మంగళవారం మొత్తం 3410 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని.. కేవలం 142 గ్రామాల్లోని ఆందోళనలు జరిగాయని స్వయంగా బీఆర్ఎస్ పత్రికలోనే చెప్పారన్నారు. అంటే కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే కొంత గొడవ జరిగింది.. అది కూడా బీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశపూర్వకంగా చేశారని ఆరోపించారు. అంటే 96 శాతం గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామసభలు జరిగినట్టు స్పష్టమవుతుందన్నారు. పదేళ్ల తర్వాత గ్రామ సభలు కాబట్టి ప్రజలు సంతోషంగా ఉన్నారని.. గ్రామ సభల్లోనే అర్హులని గుర్తిస్తున్నామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్దిదారులను ఎంపిక చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా లబ్దిదారులను గుర్తిస్తుంటే కావాలని బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరులను బట్టి పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. అందుకే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ గొడవలు చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక సామాజిక రాజకీయ కుల సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొనలేదని.. ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు. ఏ ఒక్క అర్హుడు నష్టపోకుండా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నామని స్పష్టం చేశారు.

# ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర



- ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**సిద్దిపేట, జనవరి 22:** దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు ఎందుకు పోసుకుంటున్నారు? ప్రజల డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు ప్రశ్నించారు. ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలి? దరఖాస్తు పెట్టిన ప్రతిసారి 30, 40 రూపాయలు ఖర్చు అవుతుందని, ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టాం, మీ సేవలో అప్లికేషన్ పెట్టాం, ఇప్పుడు మళ్లీ గ్రామసభల్లో అప్లికేషన్ పెట్టుకున్నామని ప్రజలు అంటున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆన్ లైన్ దరఖాస్తులు కట్టగట్టి పక్కకు పడేయడం వల్ల మళ్ళీ మళ్ళీ దరఖాస్తులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. సిద్దిపేట పట్టణం గాడిచర్లపల్లి 15వ వార్డ్ లో నిర్వహించిన గ్రామ సభలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. నిర్బంధాల మధ్య గ్రామ-సభలు నిర్వహిస్తున్నారని, ఎలక్షన్ల ముందు అందరికీ పరమాన్నం పెడుతామన్నారని, ఇప్పుడు అందరికీ పంగనామాలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని హరీష్ రావు నిలదీశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వాన్ని చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎగవేతల సిఎం రేవంత్ రెడ్డి, కోతల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కోతలు ఎన్నికల తర్వాత ఎగవేతలు అని చురకలంటించారు. రేవంత్ రెడ్డికి నిజాయితీ ఉంటే, చిత్తశుద్ధి ఉంటే యాసంగి వానకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి ఐదు లక్షల ఇల్లు కడతామని హామీ ఇచ్చారని, ఏడాది పూర్తయిందని ఒక్క ఇల్లయిన ప్రభుత్వం కట్టిందా? అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లులే తప్ప కట్టిన ఇళ్ళు లేవని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్సి, ఎస్టిలకు ఇల్లు కట్టుకునేందుకు ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కోటిమంది కూలీలు ఉంటే కోతలు పెట్టి ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం సరికాదన్నారు. ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల రూపాయలు బాకీ పడిందని, 13 నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి అవ్వాతాతలకు 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా వానకాలం, యాసంగికి కలిపి 15వేల రూపాయలు ఇవ్వాలని కోరుతున్నామని, వ్యవసాయ కూలీలందరికీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలన్నారు.

# ఆర్జీకర్ కేసులో అందరి వాదనలు వింటాం

**బెంగాల్ సర్కార్ పిటిషన్‌పై సిల్దా కోర్టు వెల్లడి**

**కేసును సోమవారానికి వాయిదా**

**కోల్‌కతా, జనవరి 22:** ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో.. అందరి వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిగణలోకి తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది. దోషి సంజయ్ రాయ్, సీబీఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్‌ను స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఈ కేసుపై సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది.కాగా, ఈ కేసులో నిందితుడికి సియాల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సీబీఐ వ్యతిరేకించింది. కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని.. ఇందులో జోక్యం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసుపై ఇటీవల విచారణ జరిపిన కోల్‌కతాలోని సియాల్దా కోర్టు నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని వివరించింది. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది.




# దావోస్‌లో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్



**దావోస్, జనవరి 22:** ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో ఈసారి తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతానికి భిన్నంగా ఈసారి ఇండియన్ గ్యాలరీలోనే అన్ని రాష్ట్రాలకు ప్రత్యేక పెవిలియన్ కేటాయించారు. 'తెలంగాణ మీన్స్ బిజినెస్' అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్ దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను, నిపుణులను ఆకట్టుకుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు అందుబాటులో ఉన్న నైపుణ్య వనరులు, తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటిచెప్పేలా ఈ పెవిలియన్‌ను అందంగా తీర్చిదిద్దారు. తెలంగాణలో నైపుణ్యాలకు కొదవ లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఇచ్చిన ప్రాధాన్యాన్ని చాటుకుంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో దేశంలోనే మొట్ట మొదటగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 18 రంగాలకు చెందిన వివిధ పరిశ్రమలకు అవసరమైన ప్రపంచ స్థాయి నైపుణ్యాలపై యువతకు శిక్షణను అందిస్తోంది. వీటితో పాటు ఐఎస్బీ, ఐఐఐటీ, నల్సార్ లాంటి ప్రముఖ విద్యా సంస్థలను ఈ జాబితాలో ప్రస్తావించారు.అభివృద్ధి నినాదాలతో తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ప్రదర్శించారు. దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన సిటీగా హైదరాబాద్ నగరానికి ఉన్న ప్రత్యేకతలు, ఆకర్షణలను కళ్లకు కట్టించేలా బ్యాక్ గ్రౌండ్ వాల్ పోస్టర్లను అమర్చారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల సమాచారాన్ని ఈ పెవిలియన్‌లో పొందుపరిచారు. దేశంలోనే మూడో అతి పెద్ద మెట్రో నెట్ వర్క్, ఎయిర్ పోర్ట్ వరకు మెట్రో విస్తరణ, దేశ విదేశీ ప్రయాణీకులకు అనువైన అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు కొత్తగా తలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్డుతో మెరుగైన రవాణా సదుపాయాలను ఇందులో ప్రస్తావించారు. తెలంగాణలో పెట్టుబడులకు ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాలను ఇందులో ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన చిన్న, మధ్యతరహా పరిశ్రమల విధానంతో పాటు, ఎలక్ట్రిక్ వెహికల్స్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఇంధన రంగాల అభివృద్ధికి ప్రోత్సహకాలతో పాటు పరిశ్రమలకు అవసరమైన అనుమతులకు సులభమైన సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ఇందులో ప్రస్తావించారు. దేశంలోనే ఉన్నత జీవన ప్రమాణాలు అందుబాటులో ఉన్న అత్యంత నివాసయోగ్యమైన నగరం హైదరాబాద్. చారిత్రకంగా సాంస్కృతికంగా వారసత్వంగా హైదరాబాద్ సిటీకి ప్రాధాన్యతలు, ఇక్కడి కళా సంపదను ప్రచారం చేయటంతో పాటు గ్రేటర్ సిటీ అభివృద్ధికి ఉన్న భవిష్యత్తు లక్ష్యాలను ఇందులో విశ్లేషించారు. భద్రతతో పాటు తక్కువ జీవన వ్యయం ఉన్న నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ పెట్టుబడులకు గమ్య స్థానంగా నిలిచింది. హైదరాబాద్ నగరం ఏర్పడినప్పటి నుంచి ఎదిగిన తీరును చార్మినార్‌తో పాటు సికింద్రాబాద్ క్లాక్ టవర్, హైటెక్ సిటీ.. అధునాతన ఫ్యూచర్ సిటీ నమూనాను తలపించే వాల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2050 లక్ష్యానికి అనుగుణంగా ఫ్యూచర్ సిటీ 14 వేల ఎకరాల్లో విస్తరిస్తుందని, అందులో 6000 ఎకరాల్లో అటవీ పరిరక్షణ ఎకో జోన్ ఉంటుందని.. ఇది దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా అభివృద్ధి చెందుతుందని భవిష్యత్తు విజన్‌ను ఇందులో పొందుపరిచారు. ఇన్నోవేషన్, ఎలక్ట్రానిక్స్, మెడికల్ టూరిజం, మరియు ఎకో-టూరిజం వంటి ప్రత్యేక జోన్లతో 'వర్క్, లైవ్, లెర్న్, ప్లే' కాన్సెప్ట్ పై ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

## రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే రక్షణ లేదు

# సోయిలేని కాంగ్రెస్ పాలన

**దాడి చేసిన వారిపై కాకుండా బాధితులపై కేసులా**

**ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు**



**హైదరాబాద్, జనవరి 22 :** రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు కూడా రక్షణ లేకుండాపోతుందని, కాంగ్రెస్ గూండాలు హద్దులు దాటుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో దివ్యాంగుడైన ఒక మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదని.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి దుండగులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. బీఆర్ఎస్‌కు భయపడి నల్గొండ రైతు మహాధర్నాకు అనుమతి ఇవ్వలేదని.. ఫ్లెక్సీలు చింపి, ఏకంగా ఓ ప్రభుత్వ ఆఫీసులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గూండాలు దివ్యాంగుడైన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని బూతులు తిడుతూ పోలీసుల ముందే దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. దాడి చేసింది మంత్రి గూండాలు అయితే.. పోలీసులు భూపాల్ రెడ్డిని అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఫైర్ అయ్యారు. ప్రశ్నించిన తమ నేతను అరెస్ట్ చేసి.. దాడి చేసిన వారిమీద ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇదీ కాంగ్రెస్ అరాచక పాలన తీరని మండిపడ్డారు. తమ నాయకుడు కంచర్ల భూపాల్ రెడ్డి మీద జరిగిన పాశవిక దాడిని ఖండిస్తున్నానన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు ఇదిలాఉండగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ తలసాని శ్రీనివాసరావు ఇంట్లో సమావేశమయ్యారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కాంగ్రెస్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదనే నిజాన్నిహైదరాబాద్ ప్రజలు అర్థం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని ఈ ప్రభుత్వానికి సోయి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.

# బీఆర్ఎస్ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకోం

**60 లక్షలు మంది సైనికులు ఉన్నా పార్టీ బీఆర్ఎస్**

**కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాంగ్రెస్‌ది : కల్వకుంట్ల కవిత**



**నల్లగొండ, జనవరి 22:** బీఆర్ఎస్ కార్యాలయాలపై కన్నెత్తి చూసినా ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. 60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం తమ బీఆర్ఎస్ పార్టీ అని, తమ పార్టీ కార్యాలయాలపై, ఇళ్లపై దాడులుకు భయపడే ప్రసక్తే లేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులారా.. జాగ్రత్తగా ఉండండి, ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరు అంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. రౌడీ మూకలతో ఇతరుల పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి తమది కాదని చెప్పారు. మూసీ మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలని కవిత చెప్పారు. రాష్ట్రాన్ని 60ఏళ్లు పాలించిన పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలుస్తుంటే కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. హైదరాబాద్ కు దగ్గర్లో ఉన్న కొండపోచమ్మ సాగర్ ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసీ - గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు. మూసీని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చుకోవాలని చూస్తున్నారని కవిత ఆరోపించారు. కాంట్రాక్టర్ల కోసమే ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. అందులో భాగంగానే అనుసంధాన ప్రాజెక్టు వ్యయాన్ని రూ.7,500 కోట్లకు పెంచారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. కొండపోచమ్మ నుంచి మూసీ అనుసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పటికీ ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకని అడిగారు. ఈ విషయంపై నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్న కవిత.. మూసీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అప్పట్లోనే ప్రణాళికలు రూపొందించారని గుర్తు చేసుకున్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపైకి ఇళ్లపైకి బుల్డోజర్లను పంపి, కూల్చివేస్తోందని కవిత ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు అయ్యే వ్యయాన్ని మొదట్లో రూ.50 వేల కోట్లు అని, ఆ తర్వాత రూ. 1లక్ష కోట్లు, మరోసారి లక్షన్నర కోట్లు అని సీఎం చెబుతూ.. మూసీని ఏటీఎంగా మార్చుకొని ఆ డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక చేస్తున్నారని చెప్పారు. మరోపక్క యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలన్న కవిత.. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని, అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారని చెప్పారు. ఫ్లోరైడ్ ని నిర్మూలించిన ఘనత కేసీఆర్ దేనని, ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన కూడా పోలేదని ఆరోపించారు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

4

గురువారం

23 జనవరి 2025


# నేటితో బేటీ బచావో, బేటీ పఢావోకు పదేళ్లు

- ట్విటర్ వేదికగా భావోద్వేగానికి లోనైన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జనవరి 22: ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'నేటితో బేటీ బచావో, బేటీ పఢావో ఉద్యమానికి పదేళ్లు పూర్తవుతాయి. గత దశాబ్ద కాలంలో ఇది ఒక కీలక పరివర్తన, ప్రజల-ఆధారిత చొరవగా మారింది. అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని పొందిందని' ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. లింగ అడ్డంకులు, పక్షపాతాలను అధిగమించడంపై ఈ ఉద్యమం దృష్టి సారించిందని, ఆడపిల్లలకు విద్య, అవకాశాలు ఉండేలా చూసేందుకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసం ప్రజలతోపాటు వివిధ కమ్యూనిటీ సంస్థలు చేపట్టిన ప్రయత్నాలకు, అంకిత భావానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పిల్లల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాలు గణనీయమైన మెరుగుదలను సాధించాయని, అవగాహన ప్రచారాలు లింగ సమానత్వం, ప్రాముఖ్యతను తెలియజేయడంలో హితోదికంగా తోడ్పడ్డాయన్నారు. దేశంలోని మహిళల హక్కులను కాపాడేందుకు, వారి విద్యకు భరోసా కల్పించేందుకు ఈ ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ఈ ఉద్యమాన్ని కింది స్థాయి నుంచి ఉధృతం చేసిన భాగస్వాములందరినీ అభినందిస్తున్నానన్నారు. మన కుమార్తెల హక్కులను పరిరక్షించడాన్ని కొనసాగిద్దాం, వారి విద్యను నిర్ధారిద్దాం. కలిసికట్టుగా వారి కోసం ఎటువంటి వివక్ష లేకుండా అభివృద్ధి చెందగల సమాజాన్ని సృష్టిద్దాం. రాబోయే రోజుల్లో మన దేశ కుమార్తెలకు గొప్ప పురోగతిని, అవకాశాలను వస్తాయ్' అని మోదీ అన్నారు.

# ట్రంపరితనంతో లాభమెంత నష్టమెంత?




ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కొందరికి నచ్చకపోవచ్చు...కానీ అమెరికన్లకు మాత్రం నచ్చి తీరుతుంది. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం బాగా ప్రాచుర్యం పొందింది. ఏ పాలకుడైనా తమ దేశ ప్రయోజనా లను మాత్రమే చూస్తారు. అందుకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటారు. ట్రంప్ కూడా ఇప్పుడు అదే విధమైన విధానాలతో ముందుకు సాగుతున్నారు. కాకపోతే అమెరికాపై చాలా మంది ఆధారపడి బతుకుతున్నందున వారికి ఇవి నచ్చకపోవచ్చు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పిల్లలను కని, వారిని అమెరికా పౌరులు చేస్తామంటే ఎవ్వరికైనా మండుతుంది. ట్రంప్‌కు అక్కడే మండింది. అందుకే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేశారు. ఉద్యోగాలు కూడా స్థానికులకే ఇవ్వాలన్నది ఆయన మొదటినుంచి పట్టుబడుతున్న వ్యవహారమే. హెచ్-1 వీసాల విషయంలోనూ ముఖ్యంగా భారతీయుల్లో ఆందోళన నెలకొంది. మాకు దక్కాల్సిన ఉద్యోగాలను ఎగరేసుకుని పోతున్నారని అమెరికన్లు ఎప్పటి నుంచే గగ్గోలు పెడుతున్నారు. ఇవన్నీ కూడా ట్రంపం ఎన్నికల ప్రచారంలో బాగా ప్రాచుర్యం పొందినవే. అమెరికాకు అనుగుణంగా ట్రంప నిర్ణయాలు తీసుకుంటున్నారు. వీటిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇవి మనకు అనుకూలంగా లేవు కనక మనం బధపడుతున్నారు. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం మేరకు నిర్ణయాలు ఉంటాయని తెలియచేస్తున్నారు. అలా అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసీ చేయగానే ట్రంప్ తను గతంలో ప్రకటించిన మేరకు నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. అందులో ఒకటి- పారిస్ ఒప్పందం నుంచి మళ్లీ బయటకు రావడం. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడతానంటూ తొలిరోజు ప్రసంగంలో దేశ ప్రజలకు హామీ ఇచ్చిన ట్రంప్.. భూతాపానికి ముకుతాడు వేసేందుకు 190కి పైగా దేశాలు ఒక్కతాటిపైకి వచ్చి కుదుర్చుకున్న ఒడంబడికనుంచి వైదొలగడంమిగతా ప్రపంచ దేశాలకు నచ్చలేదు. అందుకే అమెరికాకు తొలిసారి అధ్యక్షుడయ్యాక ట్రంప్ ఈ ఒప్పందంనుంచి వైదొలగడంతో ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వెలిబుచ్చాయి. దూకుడుతనానికీ, దుందుడుకు స్వభావానికి డొనాల్డ్ ట్రంప్ పెట్టింది పేరు. అలా ఉండటమే తనకు రెండోసారి అధ్యక్ష పదవిని కట్టబెట్టిందని ఆయన ప్రగాఢంగా విశ్వసిస్తారు. కీలకమైన పారిస్ ఒప్పందం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకున్న బైడెన్, తాను అధికారంలోకి వచ్చాక 2021లో మళ్లీ ఒప్పందంలో అమెరికాను చేర్చారు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లు అని నిర్ద్వంద్వంగా, నిస్సంకోచంగా వాదించే ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు కాగానే ఈ ఒప్పందాన్ని కాలరాచేందుకు ఉద్యుక్తుడయ్యారు. అంతేకాదు, కొవిడ్ వ్యాప్తి సమయంలో బాధ్యతారహితంగా ప్రవర్తించిందనే ఆగ్రహంతో ప్రపంచ ఆరోగ్య సంస్థనుంచి కూడా వైదొలగుతూ ఆయన నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీనివల్ల అమెరికాకు వచ్చే లాభం ఎంతన్నది ఆయన చేస్తున్న వాదనగా ఉంది.కృత్రిమ మేధ విస్తరిస్తే మనవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, బైడెన్ ప్రభుత్వం దీని విస్తరణపై విధించిన ఆంక్షలను తాజాగా ట్రంప్ తొలగించారు. కీలకమైన అంశాలపై లోతైన అధ్యయనం, విస్తృతమైన చర్చలు.. ఏవీ లేకుండా వచ్చీరాగానే కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేయడం ఆయన తొందరపాటుకు నిదర్శనమనే చెప్పాలి. పదవిలోకి రాకముందే హమాస్- ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు పలికారనే ఘనతను ట్రంప్ దక్కించుకున్నారు. ఆయన హెచ్చరికలవల్లే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ దిగి వచ్చారని విశ్వసించేవారు ఎంతోమంది ఉన్నారు. రష్యా -ఉక్రెయిన్ యుద్ధానికి కూడా ట్రంప్ చరమాంకం పలుకుతారని ఆయన అనుయాయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు యుద్ధ విరమణకు కృషి చేస్తూ, మరోవైపు గ్రీన్‌లాండ్‌నూ, పనామా కాలువనూ స్వాధీనం చేసుకుంటామంటూ తొలిరోజే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ట్రంప్ మనస్తత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అనేది ఇక్కడ ప్రశ్న. తొలిసారి మాదిరిగానే ఈసారి కూడా ట్రంప్ ప్రసంగం దూకుడుగా, తన మద్దతుదారులు, దేశప్రజలలో ఉత్సాహం నింపేదిగా సాగింది. 'అమెరికాకు స్వర్ణయుగం మొదలైంది. మునుపెన్నడూ లేనంత దృఢమైన, పటిష్ఠమైన, అసాధారణమైన దేశంగా అమెరికాను తీర్చిదిద్దుతా'నంటూ ఆయన అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మొదటిసారికంటే ఈ తడవ మరింత శక్తిమంతమైన నేతగా ట్రంప్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రతినిధుల సభలోనూ, సెనేట్‌లోనూ మెజారిటీ బలం రిపబ్లికన్ పార్టీదే కావడం ఇందుకు కారణం. భారత్,అమెరికా ద్వైపాక్షిక సంబంధాల విషయానికొస్తే మోడీ- జో బైడెన్ హయాంలో ఇరుదేశాల మధ్య బంధం మున్నెన్నడూ లేనంతగా బలోపేతమైందనేది జగద్విదితం. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడన్న నానుడిని నిజం చేస్తూ ఇరు దేశాలకూ పక్కలో బల్లెంలా మారిన చైనా.. ఈ రెండు దేశాల మధ్య స్నేహసంబంధాలు బలపడటానికి కారణమైంది. అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీ సుంకాలు విధిస్తోందని అంటూ ఇప్పటికే పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్, భారత్ ఉత్పత్తులపైనా అదే విధంగా సుంకాలు విధించే అవకాశం ఉండవచ్చు. అంతమాత్రానికే, ఇరు దేశాల మధ్య సంబంధాలు బలహీన పడతాయని భావించరాదు. ట్రంప్ విదేశాంగ విధానంలో కొంత గందరగోళం ఉంటుందన్నది విస్పష్టం. అమెరికాకు ప్రత్యామ్నాయ ఆర్థిక శక్తిగా ఎదిగుతున్న చైనా మెడలు వంచడం అనుకున్నంత సులభమేమీ కాదు. ఏదేమైనా ఎవరి విధానాలు వారివి. వారికి అనుగుణంగానే ఇతర దేశాలు నడుచుకోవాలి. అవి మనకు ఉపయోగమా కాదా అన్నది ముఖ్యం కాదు. అక్కడి చట్టాలు, పరిస్థితులకు అనుగుణంగా మనం నడుచుకోగలమా లేదా అన్నదే ముఖ్యం.

# ఆ యూనివర్సిటీపై కొరడా

## జార్ఖండ్‌లోని ప్రజ్ఞాన్ గుర్తింపు రద్దు చేస్తూ యూజీసీ నిర్ణయం




**జార్ఖండ్, జనవరి 22:** యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. జార్ఖండ్‌లోని ప్రజ్ఞాన్ యూనివర్సిటీని యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటన జారీ చేసింది. యూజీసీ యాక్ట్ 1956 సెక్షన్ 2(0) ప్రకారం ఈ మేరకు ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ పేరును తొలగించినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జార?ండ్ ప్రభుత్వం యూనివర్సిటీ స్థాపన చట్టాన్ని రద్దు చేయడంతోపాటు పలు నిబంధనలను పాటించని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జార్ఖండ్‌కు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ గతేడాది మార్చిలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. జార?ండ్ ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ చట్టం 2016 ప్రకారం ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ స్థాపించబడింది. 2016 ఆగస్టు 3న యూజీసీ జాబితాలో చేరింది. అయితే ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ యాక్ట్ 2016'ని 2024లో ఆ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ రిజల్యూషన్ ప్రకారం, ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ 2016 సంవత్సరంలో స్థాపించిన తర్వాత కూడా ఉనికిలోకి రాలేదు. అక్కడ బోధన జరుగుతున్నట్లు ఎలాంటి ఆధారాలు యూజీసీకి సమర్పించలేదు. పైగా యూజీసీ పంపిన టెలిఫోన్ కాల్‌లు, ఇమెయిల్‌లకు యూనివర్సిటీ స్పందించలేదు. ఈ క్రమంలో జార?ండ్ ప్రభుత్వ హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ మార్చి 20, 2024న జార?ండ్ గెజిట్‌లో.. ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ యాక్ట్, 2016ను రద్దు చేస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. 2016లో విశ్వవిద్యాలయం ప్రారంభమైనప్పటి నుంచి విద్యా కార్యకలాపాలను ప్రారంభించడంలో విఫలమైందని తీర్మానంలో హైలైట్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జార్ఖండ్ చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం గుర్తింపు పొందిన యూనివర్సిటీల జాబితా నుంచి యూజీసీ అధికారికంగా ప్రజ్ఞాన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని తొలగించింది.

# ప్రయాగ్‌రాజ్‌లో యూపీ కేబినేట్ భేటీ

- కుంభమేళాలో సీఎం యోగి స్నానం
- గంగాస్నానంలో పాల్గొన్న 54మంది మంత్రులు



**ప్రయాగ్‌రాజ్, జనవరి 22:** కుంభమేళాలో ఆసక్తికరమైన సన్నివేశం అందరిని ఆకట్టుకుంది. యూపీ కేబినెట్ మొత్తం ఒకేసారి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించింది. సీఎం యోగితో పాటు డిప్యూటీ సీఎం బ్రిజేష్ పాఠక్ , కేశవ్‌ప్రసాద్ మౌర్య , ఇతర మంత్రులు గంగానదిలో స్నాన్నం చేశారు. 54 మంది మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గంగానదికి హారతి ఇచ్చారు. ప్రయాగ్‌రాజ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ కేబినెట్ కీలక భేటీ జరిగింది, ఇందులో అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్గం మొత్తం మహాకుంభానికి వెళ్లి సంగం బ్యాంకుల్లో స్నానం చేసింది. తన మంత్రులతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లోని వలస పక్షులకు ముఖ్యమంత్రి యోగి ఆహారం ఇచ్చారు . ప్రయాగ్‌రాజ్-చిత్రకూట్ అభివృద్ధి ప్రాంతంతో పాటు వారణాసిలో కూడా నీతి ఆయోగ్ సహాయంతో అభివృద్ధి చేస్తామని సీఎం యోగి చెప్పారు.ప్రయాగ్‌రాజ్‌లో యోగి కేబినెట్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గంగానదిపై ఆరు లేన్ల వంతెన నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రయాగ్‌రాజ్-చిత్రకూట్ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రయాగ్‌రాజ్ పరిసర ప్రాంతాలకు స్థిరమైన అభివృద్ధిని సృష్టించడానికి రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సిఎం యోగి తెలిపారు. గంగా ఎక్స్‌ప్రెస్ వే దాని మౌలిక సదుపాయాల కోసం విస్తరించడం జరుగుతుందన్నారు. గంగా ఎక్స్‌ప్రెస్ వే ప్రయాగ్‌రాజ్ నుండి మిర్జాపూర్ మీదుగా భాదోహికి కాశీ, చందౌలీ మీదుగా కలుపుతుంది. ఘాజీపూర్ వద్ద పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేకి కలుపుతుంది. వారణాసి ,చందౌలీ నుండి ఈ గంగా ఎక్స్‌ప్రెస్ వే సోన్‌భద్రను జాతీయ రహదారికి కలుపుతుంది. ప్రయాగ్‌రాజ్, వారణాసి , ఆగ్రా మునిసిపల్ కార్పొరేషన్‌లు సంయుక్తంగా ఆరు జిల్లాలను కలిపే ఈ రహదారి అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నట్లు సీఎం తెలిపారు. గత వారం రోజుల్లో 9.25 కోట్ల మంది భక్తులు పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు సీఎం యోగి తెలిపారు. ప్రయాగ్‌రాజ్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రయాగ్‌రాజ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కోసం బాండ్లను జారీ చేస్తుంది. ఏకంగా కేజీఎంయూ కేంద్రాన్ని మెడికల్ కాలేజీగా ఏర్పాటు చేయాలని యూపీ కేబినెట్ నిర్ణయించింది. మూడు జిల్లాలు, హత్రాస్, కాస్గంజ్, బాగ్‌పత్‌లలో మూడు కొత్త వైద్య కళాశాలలు స్థాపనకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే 62 ఐటీఐలు, 5 ఇన్నోవేషన్, ఇన్వెన్షన్, ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పారు. తొలిసారిగా కేబినెట్ అంతా మహాకుంభ్‌కు హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన విధానాలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రయాగ్‌రాజ్‌కు సంబంధించిన అంశాలపై కూడా చర్చించారు. ఉత్తరప్రదేశ్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ అండ్ ఎంఎ÷-లాయ్‌మెంట్ పాలసీ 5 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఇది పునరుద్ధరించడంతో పాటు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త ప్రోత్సాహకాలను సీఎం యోగి ప్రకటించారు.



# అలెగ్జాండ్రిన్ చిలుకల అమ్మకం

## నగరంలోని పాతబస్తీలో వ్యక్తి అరెస్టు

**హైదరాబాద్, జనవరి 22:** నగరంలోని పాతబస్తీలో మహ్మద్ ఫారూఖ్ అనే వ్యక్తి ఏకంగా 110 అలెగ్జాండ్రిన్ చిలుకలను అమ్ముతూ పట్టుబడ్డాడు. ఇప్పుడు ఉన్న వాతావరణ పరిస్థితుల్లో ఈ చిలుకలు చాలావరకు తగ్గిపోయాయి. అరుదుగా కనపడుతుంటాయి. ఇక హైదరాబాద్ వంటి నగరాల్లో అయితే కొన్ని ప్రాంతాల్లో తప్ప అసలు కనపడడం లేదు. ఈ క్రమంలోనే పాతబస్తీలో మహ్మద్ ఫారూఖ్ అనే వ్యక్తి ఏకంగా 110 అలెగ్జాండ్రిన్ చిలుకలను అమ్మడం తీవ్ర కలకలం రేపింది. సమాచారం తెలుసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు ఫారూఖ్ ని పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న 110 అలెగ్జాండ్రిన్ చిలుకలను అటవీ అధికారులు జూపార్కుకు తరలించారు. ఈ ఘటనపై తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్) ఆర్ఎం డోబ్రియల్ మాట్లాడుతూ.. అలెగ్జాండ్రిన్ చిలుకలను అక్రమంగా అమ్ముతున్న మహ్మద్ ఫారూఖ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. వన్యప్రాణి చట్టం ప్రకారం చిలుకలను వేటాడటం నేరం అని హెచ్చరించారు.






# బుర్ర శేఖర్‌గౌడ్‌కు సన్మానం

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన బుర్ర శేఖర్ గౌడ్‌కు చీర్లవంచ బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ట శ్రీకాంత్, బీరెడ్డి శ్రీనివాసరెడ్డి, తమ్మిశెట్టి బాలకృష్ణ, జక్కుల మధు, బోనాల రాజమల్లు, సొల్ల దేవేందర్, సుదగోని సాయికృష్ణలు తదితరులు పాల్గొన్నారు. అలాగే చింతలఠాణ గ్రామస్తులు సైతం తమ గ్రామానికి ఆహ్వానించి బుర్ర శేఖర్‌గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంట మహేశ్, బడుగు అంజనేయులు, చొక్కల మధు, గొడుగు మహేశ్, బియ్యాల మధు, చొక్కల ప్రశాంత్, గడ్డి ప్రశాంత్, చొక్కల ప్రశాంత్, చొక్కల కళ్యాణ్‌తో పాటు మారుపాక బీజేపీ నాయకుడు శంకర్, ఆరేపల్లి బీజేపీ నేత లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి షరతుల్లేకుండా రైతు భరోసా

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**ప్రజానావ, కోనరావుపేట:** ఎలాంటి షరతుల్లేకుండా రైతులందరికీ రైతు భరోసా అమలు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మీ ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకుపోతున్నామని, ఈ నెల 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం రేషన్‌కార్డులిచ్చి, సన్నపు బియ్యం అందించనున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా దరఖాస్తు చేసుకోవచ్చని లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ నెల 26న పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజల మధ్య చర్చించి నిజమైన అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12,000 రూపాయలకు రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించిందన్నారు. జనవరి 16 నుంచి జనవరి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జనవరి 21 నుంచి జనవరి 24 వరకు గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న నాలుగు కార్యక్రమాలను జనవరి 26 నుంచి అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే కోనరావుపేట మండల పరిధిలోని మూల వాగు పేంటు వాగుపై నాలుగు బ్రిడ్జిల నిర్మాణం చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయప్రకాశ్ రావు, జీపీ స్పెషల్ ఆఫీసర్ అంజయ్య, జీపీ కార్యదర్శి అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు ఆజీమ్ పాషా భాశెట్టి నాగరాజు, నాగభూషణం, వాల్య, సీహెచ్ గంగాధర్, పెంతల శ్రీనివాస్, బొర్ర రవి, నాగండ్ల భూమేశ్, మానుక సత్యం, సదానందం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈవో




**ప్రజానావ, బెజ్జంకి:** మండలంలోని వడ్లూరు బేగంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యాధికారి మహతి లక్ష్మి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గోపీకృష్ణ, ఉపాధ్యాయుల సమక్షంలో ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈవో మహతి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించడానికి, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో కృషి చేసి పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్ల కొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నారోజు శంకరాచారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పుల్లూరి ప్రభాకర్, శ్రీరామ్ శ్రీనివాస్, రాజేందర్, నరసింహారెడ్డి, తిరుపతి, రేణుక, రూప తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే గారూ.. ప్రజల దాహార్తి తీర్చండి

**బీఆర్ఎస్ నేత గూడూరి సురేశ్**

**ప్రజానావ, గన్నేరువరం:** మండలంలో తీవ్ర నీటి సమస్య నెలకొందని, వాటర్ సంపులు, ప్లాంట్ల వద్ద నీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నేత గూడూరి సురేశ్ బుధవారం గ్రామసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో వార్డుల్లో మోటార్లు నడవడం లేదని, ఫీజ్‌లను కూడా తీసుకెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామసభ అనంతరం వాటర్ సంపును పరిశీలించిన ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఎమ్మెల్యే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సురేశ్ వెంట నాయకులు తాటికొండ తిరుపతి, బత్తిని శేఖర్, బోయిని ప్రశాంత్, మంకలి కృష్ణ, మల్లేశ్, సాగర్, శేఖర్ తదితరులున్నారు.

## సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

**జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్**

**ప్రజానావ, బెజ్జంకి:** ప్రజాపాలనలో భాగంగా నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారులు ఎంపిక కోసం ఏర్పాటు చేస్తున్న గ్రామ సభల్లో భాగంగా బుధవారం తలారివానిపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభకు జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరయ్యారు. ఇందులో భాగంగా నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారులు జాబితా ప్రకటించారు. జాబితాలో పేర్లు లేని వారు గ్రామసభలో దరఖాస్తు అందజేయాల్సిందిగా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ భరత్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి నాగరాణి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు హుస్నాబాద్ లో మంత్రి పర్యటన



**ప్రజానావ, హుస్నాబాద్:** రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

## చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

**ప్రజానావ, సిరిసిల్ల:** వృద్ధురాలిని దారి అడుగుతూ ఆమె మెడలోని బంగారు గొలుసు దొంగలించిన ఇద్దరు నిందుతులకు సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ 13 నెలల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ముస్తాబద్ ఎస్ఐ గణేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ముస్తాబద్ మండలం గూడెం గ్రామానికి చెందిన బొప్ప మల్లవ్వ తన ఇంటి ముందు కూర్చొని ఉండగా, ద్విచక్రవాహనంపై వచ్చిన మ్యాన శివ, కూరపాటి నరేశ్‌లు రామలక్ష్మణపల్లెకు వెళ్లే దారి అడుగుతూ మల్లవ్వ మెడలోని బంగారు పుస్తెలతాడు తెంపుకొని పోయారు. బొప్ప దేవరాజు ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసిన ముస్తాబాద్ అప్పటి ఎస్ఐ శేఖర్ ఇద్దరు నిందుతులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించి చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ అడేపు దేవేందర్, ఏడుగురు సాక్షులను ప్రవేశపెట్టాగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుముల సందీప్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందుతులిద్దరికీ 13 నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



## కంటి చికిత్స కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**ప్రజానావ, బెల్లంపల్లి:** పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో బుధవారం కంటి చికిత్స కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ రమ దంపతులతో పాటు ఆయన కుమార్తె గడ్డం వర్ష అరుణ్ బుధవారం సందర్శించారు. అంతకు ముందు ఆసుపత్రిని పరిశీలించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. డాక్టర్ అజయ్ చక్రవర్తి బృందం అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు జక్కుల శ్వేత, స్థానిక కౌన్సిలర్ బండి ప్రభాకర్, బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు బొమ్మెన హరీశ్ గౌడ్, నాయకులు గట్టు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో 'క్రీడోత్సవ్ - 2025' పోస్టర్ విడుదల

**ప్రజానావ, హుస్నాబాద్:** ఏబీవీపీ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'క్రీడోత్సవ్–2025' పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నగర ఖేల్ కన్వీనర్ అంజి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక దృఢతకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు విద్యార్థుల సర్వాంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని క్రమశిక్షణ పోరాట పటిమ జట్టు స్ఫూర్తి భావనలను అభివృద్ధి చేసేలా క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఖేలో భారత్ పేరుతో దేశవ్యాప్తంగా ఏబీవీపీ చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ గెలుపోటములను పరిచయం చేసి వారి జీవిత లక్ష్యాలను సాధించేందుకు సహాయపడడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. జనవరి 27నుంచి 30 వరకు స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవాల సందర్భంగా ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాలలు, పాఠశాలల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఈ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంసాని రాకేశ్, నగర ఉపాధ్యక్షుడు రాజేష్, నగర సంయుక్త కార్యదర్శి చరణ్, సోషల్ మీడియా కన్వీనర్ భాను, రాజేష్, వెంకటేశ్, వంశీ, అంజన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.




## రాహుల్ వ్యాఖ్యలు బాధాకరం



**ప్రజానావ, గన్నేరువరం:** దేశంపై తమ పోరాటం ఉంటుందని వ్యాఖ్యానించిన కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు బాధాకరమని బీజేపీ మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విదేశాల్లో హిందూ ధర్మాన్ని కించపరిచే విధంగా రాహుల్ వ్యాఖ్యలు చేశారని, పలు సభల్లో హిందువులు, దేశం గురించి హేళనగా మాట్లాడినా కాంగ్రెస్ నాయకులు సమర్థించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు దేశానికి మద్దతిస్తారా.. లేక దేశంతోనే పోరాడుతారా అనే విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా నికేశ్ డిమాండ్ చేశారు.

## మాజీ మంత్రి తలసాని చేతులమీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజానావ, బెల్లంపల్లి:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలో గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్ యాదవ్, సలహాదారు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 శాతం ఉన్న గొల్ల కురుమలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షుడు మధు యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చేగొండ రాజన్న యాదవ్, సాయన్న, వెంకట్, ఇజ్జగిరి మధుకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పథకాలు అందజేస్తాం



**ప్రజానావ, బెల్లంపల్లి:** పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రజాపాలన సభను నిర్వహించారు. సభను ఆర్డీఓ హరికృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు లబ్ధిదారుల పేర్ల వివరాలను చదివి వినిపించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ పేర్లు రానివారు వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి




**ప్రజానావ, కోహెడ:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రైనీ ఎస్ఐ సైఫ్ అలీ అన్నారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండలంలోని కపూర్ నాయకండాలో వాహనదారులు, ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, నివారణ, ట్రాఫిక్ నింబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహణదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని, మైనర్లకు వాహనాలు అసలే ఇవ్వవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లితండ్రులతో పాటు వాహనాల యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతీ వాహనా దారుడు కూడా వాహనం నడిపేటప్పుడు వాహనానికి సంబందించిన అనుమతి మత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా వద్ద ఉంచుకోవాలని సూచించారు.

## ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం

**ప్రజానావ, బెజ్జంకి:** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం అని తోటపల్లి మాజీ సర్పంచ్ బోయినపల్లి నర్సింగ రావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునందన్ రాజు బదిలీపై వెళ్లగా పాఠశాలలో బుధవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలలో మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగంగా ఇటీవల నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థినిలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు రఘునందన్ రావు మాట్లాడుతూ మాజీ సర్పంచ్ సహాయ సహకారాలతో పాఠశాలలో ఎటువంటి ఇబ్బంది ఉన్న ఒక్క చిన్న ఫోన్ కాల్ తో స్పందించి ఆ సమస్యకు పరిష్కారం చూపే వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబరి సతీష్, నల్లగొండ నర్సయ్య, అమ్మిగల్ల సురేశ్, పోలవేణి శ్రవణ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
6 గురువారం 23 జనవరి 2025

# ప్యాసింజర్ వాహనాలకు క్యూఆర్ కోడ్




## డ్రైవర్లకు ప్రమాద బీమా పత్రాలు అందజేసిన ఎస్పీ

**ప్రజానావ, సిరిసిల్ల:** ప్యాసింజర్ వాహనాలకు అభయ క్యూఆర్ కోడ్‌లతో పాటు డ్రైవర్లకు ప్రమాద బీమా పత్రాలను బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ ఆ ధ్వర్యంలో జిల్లాలో ఉన్న ప్యాసింజర్ వాహనాలకు మొదటి దశలో 4000 వాహనాలకు క్యూఆర్ కోడ్ అనుసంధానం చేయడం జరిగిందని, రెండో దశలో కొత్తగా 800 వాహనాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను అనుసంధానించినట్లు చెప్పారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాలకు అనునిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తారని, వారి రక్షణ దృష్ట్యా 'మై ఆటో సేఫ్' అనే క్యూఆర్ కోడ్‌తో పాటు అభయ యాప్ తో వాహనాల డ్రైవర్లకు రూ.50తో ప్రమాద భీమా పత్రాలు అందించడం జరిగిందన్నారు. దీనిని ప్రతి సంవత్సరం రూ.50తో రిన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆసురక్షితంగా భావించే ఏదైనా పరిస్థితిని సంఘటనలను ఎదుర్కొన్నపుడు ఆటోకి ముద్రించిన "క్యూ అర్ కోడ్"ను స్కాన్ చేయాలని స్కాన్ చేయగానే వెంటనే డ్రైవర్ ఫోటో, వివరాలు వస్తాయన్నారు. స్కాన్ చేసిన వ్యక్తి ఫోన్ నెంబర్ యాప్ లో ఎంట్రీ చేసి ట్రేస్ ద లొకేషన్ అని ఎంట్రీ చేయగానే వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్, ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్‌వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది ఆటోలో ఎక్కినప్పటి నుండి దిగేంతవరకు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా మానిటర్ చేయడం జరుగుతుందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సమీపంలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని తగు రక్షణ చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఆటోలో ఎక్కిన మహిళలు, ప్యాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవాలని సూచించారు. గతంలో ఆటో డ్రైవర్ ఏదైనా పోలీస్ కేసులో ఇన్వాల్వ్‌మెంట్ అయి ఉంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే థిస్ ఆటో నాట్ సేఫ్ అనే రెడ్ సిగ్నల్ వస్తుందని, ఇది ప్రయాణికులకు సేఫ్ జర్నీ చేయడానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. ఆటో డ్రైవర్లు ఏదైనా నేరాలకు పాల్పడిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా సీసీ కెమెరాల ద్వారా కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ చేసినా ఈ అప్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐలు రాజు, రమేశ్, అభయ యాప్ సృష్టికర్త అభిచరణ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



## సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి

**ప్రజానావ, హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకరా బాబులు బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్, గాంధీ, నెహ్రూ వంటి స్వాతంత్ర సమరయోధులతో పాటు మహానుబావుల విగ్రహాలు ఉన్నాయని, పట్టణ ప్రజల ఆకాంక్ష మేరకు సుభాష్ చంద్రబోస్ విగ్రమాన్ని సైతం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంతస్వామి, గాదాసు రాంప్రసాద్, సంతోష్, రాజేందర్ తదితరులున్నారు.

## అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మేయర్



**ప్రజానావ, కరీంనగర్:** భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన గొప్ప మేధావి అని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా బుధవారం నగరానికి ముఖద్వారమైన అలుగునూరు చౌరస్తాలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని పలువురు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ప్రారంభం చేశారు. ఆయన విగ్రహానికి మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించి, ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాలు పరిపాలన చేస్తూ, ప్రజలకు సేవలందిస్తున్నాయంటే, దానికి ముఖ్య కారణం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కరేనని గుర్తుచేశారు. తన మేథాశక్తితో డాక్టరేట్ పట్టాలను పొంది ప్రపంచ దేశాల్లోనూ అరుదైన గౌరవాన్ని సంపాదించారని కొనియాడారు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాల్లో పరిశోదనలు చేశారని, ఇలాంటి గొప్ప మహానీయుని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అలాంటి మహానీయుని కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషం అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం దీక్షకు బయల్దేరిన రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ అలుగునూరు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్దే అరెస్టు అవడం జరిగిందని గుర్తుచేశారు. మళ్లీ ఇదే ప్రాంతంలో మహనీయుని విగ్రహాన్ని ప్రతిష్టించి ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, ఎదుల్ల రాజశేఖర్, ఐలేందర్ యాదవ్, సుధగోని మాధవి కృష్ణ గౌడ్, కోల మాలతి సంపత్ రెడ్డి, స్థానిక నాయకులు మల్లారెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పథకాలు అందేవిధంగా కృషి: మేయర్




**ప్రజానావ, కరీంనగర్:** ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన వార్డు సభల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వానికి పంపి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ 33 వ డివిజన్ భగత్ నగర్ పోలీస్ క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రభుత్వ చేపట్టిన ప్రజాపాలన వార్డు సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డు సభలో వార్డు ఆఫీసర్, అధికారులకు దరఖాస్తుల స్వీకరణ పై ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగర వ్యాప్తంగా 60 డివిజన్లలో రెండు రోజులు ప్రజల నుంచి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ బరోసా దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ప్రభత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయి?

**కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన వారికే పథకాలన్నప్పుడు ఈ నాటకాలు దేనికి?**

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు బొంతల కళ్యాణ్ చంద్ర**



**ప్రజానావ, కరీంనగర్:** 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా పాలన పేరిట స్వీకరించిన దరఖాస్తులు ఏమయ్యాయి? ఇటీవల కుల గణన సర్వే పేరిట స్వీకరించిన డేటా ఏమైంది? ఏడాదికాలంగా ఎన్ని ప్రజాపాలన అప్లికేషన్లు పరిష్కరించారో చెప్పకుండా మళ్లీ ప్రజా పాలన దరఖాస్తుల పేరిట గ్రామ సభలు నిర్వహించి ఏం చేస్తారు' అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడు బొంతల కళ్యాణ్ చంద్ర ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రజాపాలన పేరిట దరఖాస్తులను స్వీకరించి వాటిలో ఏ ఒక్కరి అప్లికేషన్ అయిన పరిష్కరించకుండా అటకెక్కించిందని విమర్శించారు. మళ్లీ కులగణన సర్వే పేరిట కుటుంబ పూర్తి డేటాను సేకరించి, ఇందులో కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన వారికి రేషన్ కార్డులను ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ప్రజల డేటాను స్వీకరించి కాంగ్రెస్ ఏడాది కాలంలో సాధించిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే బాహాటంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులకే పథకాలు ఇస్తామని బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నప్పుడు దరఖాస్తుల స్వీకరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు.

## లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు: సీపీఐ



**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పూర్తిగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు ఒక ప్రకటనలో తీవ్రంగా ఆరోపించారు. కరీంనగర్‌లో ఇండ్ల కోసం సర్వే చేసిన అధికారులు పూర్తిగా అర్హులను కాకుండా వారికి ఇష్టమొచ్చిన వారిని ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నించారు. బహుళ అంతస్తులు ఉన్న వారిని కూడా ఈ లబ్ధిదారుల లిస్టులో పెట్టడం విడ్డూరంగా ఎద్దేవా చేశారు. తూతూ మంత్రంగా ఏదో ఎంక్వయిరీ చేసినామంటే చేసినామనే విధంగా అధికారులు వ్యవహరించార ని ఇందులో పేదవారు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన కార్యక్రమం జరిగే ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు అర్హుల లిస్టు అని గోడలకు అతికేసి చేతులు దులుపుకున్నారని, మళ్లీ రీ సర్వే చేస్తే 20శాతం మంది కూడా అర్హులు ఉండరన్నారు. ఇది ప్రభుత్వాన్ని ప్రజలను అధికారులు తప్పుదోవ పట్టించడమేనని వారు విమర్శించారు. ఈ లబ్ధిదారుల ఎంపిక ఏ విధంగా చేశారో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఈ అక్రమాలపై వెంటనే విచారణ జరిపించాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో పేదలతో ఆందోళన చేస్తామని కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు హెచ్చరించారు.



## కేంద్రమంత్రి చేతులమీదుగా సైకిళ్లు, కుట్టు మిషన్ల పంపిణీ

**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇందుర్తి పాఠశాలలోని పేద విద్యార్థులకు సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లను బుధవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. చదువుకు దూరం కాకూడదని ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను గుర్తించి కరీంనగర్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లను, అలాగే పదిమంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోరిట్యాల వెంకట కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు బీ. ఓదెల్ కుమార్ కి ధన్యవాదాలు తెలిపారు.




## జాతీయ రోడ్డు భద్రత అవగాహన




**ప్రజానావ, బెజ్జంకి:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు, యువకులు, గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని చెప్పారు. వాహనం నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

## ఎమ్మెల్యేపై అవాస్తవ ప్రసారం చేసిన ఛానెల్‌పై చర్యలు తీసుకోవాలి




### పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ యూత్ నాయకుల ఫిర్యాదు

**ప్రజానావ బెజ్జంకి:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో భాగంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభలో మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ ఛానల్ ఆయనపై అవాస్తవ సమాచారాన్ని ప్రసారం చేస్తూ, బురద జల్లే ప్రయత్నం చేసిందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కర్రావుల సందీప్ బెజ్జంకి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ లక్ష్మీపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభకు ఆ ఛానెల్ ప్రతినిధి హాజరుకాకపోయినా నిరాధార ప్రసారాలు చేస్తున్నారని విమర్శించారు. మీడియా నిబంధనలను ఉల్లంఘించి, ఎమ్మెల్యే పై అవాస్తవ సమాచారాన్ని ప్రసారం చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మచ్చ కుమార్, మానకొండూర్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శానకొండ శరత్, నాయకులు రాజురెడ్డి, జేరిపోతుల మధు, నవీన్, ప్రశాంత్, శ్రీకాంత్, శ్రీహరి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## పథకాలను ప్రజలకు అందించేందుకే గ్రామ సభలు

**ప్రజానావ, బెజ్జంకి:** సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకే గ్రామ సభలు ఏర్పాటు చేయటం జరిగిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి క్రిష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. రైతు భరోస్తా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మధుసూదన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ అంజయ్య, ఏఈపీఆర్ సమ్మయ్య, ఏపీఓ రాజబాబు, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






# అభిషేక్ ఊచకోత

## అర్ధసెంచరీతో ఆకట్టుకున్న టీమిండియా ఓపెనర్

## తొలి టీ20లో ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం

**కోల్‌కతా:** సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. కోల్‌కతా వేదికగా బుధవారం జరిగిన తొలి టీ20లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. అభిషేక్ శర్మ (34 బంతుల్లో 5 ఫోర్లు,8 సిక్స్‌లతో 79 ) విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత్ సునాయస విజయాన్నందుకుంది. ఈ గెలుపుతో 5 టీ20ల సిరీస్‌లో టీమిండియా 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జోస్ బట్లర్ (44 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68) ఒంటరి పోరాటం చేయగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. హ్యారీ బ్రూక్(17), జోఫ్రా ఆర్చర్(12) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్.. అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో 12.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. అభిషేక్ శర్మతో పాటు సంజూ శాంసన్(20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26), తిలక్ వర్మ(16 బంతుల్లో 3 ఫోర్లతో 19 నాటౌట్) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(2/21) రెండు వికెట్లు తీయగా, ఆదిల్ రషీద్‌కు ఓ వికెట్ దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 శనివారం చెన్నై వేదికగా జరగనుంది.

### సంజూ అదిరిపోయే ఆరంభం..

అంతకుముందు స్వల్ప లక్ష్య చేధనకు దిగిన టీమిండియాకు ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. దూకుడుగా ఆడిన ఈ జోడీ తొలి వికెట్‌కు 41 పరుగులు జోడించింది. భారీ షాట్ ఆడబోయి సంజూ శాంసన్, సూర్యకుమార్ యాదవ్(0) ఒకే ఓవర్‌లో వెనుదిరిగినా.. తిలక్ వర్మతో కలిసి అభిషేక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 29 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలు చేశారు. ఈ అవకాశంతో అతను చెలరేగిపోయాడు.

### 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ

భారీ సిక్స్‌లతో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పవర్ ప్లేలో 2 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసిన టీమిండియా.. అనంతరం అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా అభిషేక్ శర్మ భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అభిషేక్ శర్మ.. అనంతరం మరింత దూకుడుగా ఆడుతూ భారీ సిక్సర్లు కొట్టాడు. అభిషేక్ శర్మను ఆదిల్ రషీద్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చినా, క్రీజులోకి వచ్చిన హార్దిక్ పాండ్యా(3 నాటౌట్)తో కలిసి తిలక్ వర్మ విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు.

### టీ20ల్లో చరిత్ర సృష్టించిన అర్ష్‌దీప్

టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. తొలి స్పెల్‌లోనే 2 వికెట్లు పడగొట్టి ఈ ఘనతను సాధించాడు. తొలి ఓవర్‌లోనే ఆ జట్టు ఓపెనర్ ఫిల్ సాల్ట్(0)ను అర్ష్‌దీప్ సింగ్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. తన మరుసటి ఓవర్‌లో మరో ఓపెనర్ బెన్ డకెట్(4) క్యాచ్ ఔట్ చేశాడు. ఈ రెండు వికెట్లతో యుజ్వేంద్ర చాహల్ రికార్డ్‌ను అధిగమించాడు. 80 టీ20ల్లో యుజ్వేంద్ర చాహల్ 96 వికెట్లు పడగొట్టగా.. అర్ష్‌దీప్ సింగ్ 61 టీ20ల్లోనే 97 వికెట్లు తీసి అతన్ని వెనక్కినెట్టాడు. ఈ జాబితాలో అర్ష్‌దీప్ సింగ్(97), యుజ్వేంద్రచాహల్(96) తర్వాత భువనేశ్వర్ కుమార్ (87 టీ20ల్లో 90 వికెట్లు), జస్‌ప్రీత్ బుమ్రా(71 టీ20ల్లో 89 వికెట్లు) కొనసాగుతున్నారు. ఈ సిరీస్‌లో అర్ష్‌దీప్ సింగ్ మరో 3 వికెట్లు తీస్తే టీ20ల్లో 100 వికెట్ల మైలురాయి అందుకున్న తొలి బౌలర్‌గా చరిత్రకెక్కనున్నాడు. 2022లోనే అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్ సింగ్ రెండేళ్ల వ్యవధిలోనే 100 వికెట్ల మైలురాయికి చేరువయ్యాడు.

### అందుకే ఓడిపోయా: జోస్ బట్లర్

పిచ్ కండిషన్స్‌ను అంచనా వేయడంలో విఫలమవడంతో పాటు బ్యాటింగ్ వైఫల్యం తమ ఓటమిని శాసించిందని ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ అన్నాడు. టీమిండియా తమ కంటే మెరుగ్గా ఆడిందని కొనియాడాడు. 'పిచ్ మేం ఊహించిన విధంగా లేదు. ఆరంభంలోనే కీలకమైన వికెట్లు కోల్పోయాం. బ్యాటింగ్ చేయగల వికెట్‌పై మా బ్యాటర్లు రాణించలేకపోయారు. జోఫ్రా ఆర్చర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. భారత్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. మార్క్ వుడ్ వేగంగా బౌలింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో ఓడినా మేం ఇదే దూకుడు కొనసాగిస్తాం. అయితే వేదికను బట్టి అక్కడి పరిస్థితులను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఆటను ఆస్వాదించడం ఎప్పుడూ ఉంటుంది. నేను ఇక్కడి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నాను. బ్రెండన్ మెక్‌కల్లమ్‌కు నేను పెద్ద అభిమానిని. అతనితో పనిచేయడాన్ని నేను ఆస్వాదిస్తాను' అని బట్లర్ చెప్పుకొచ్చాడు.

# సెమీస్‌లో సిన్నర్, స్వియాటెక్

## కీస్, షెల్టన్ ముందుకు ఆస్ట్రేలియా ఓపెన్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ) పురుషుల సింగిల్స్ విభాగంలో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. అమెరికాకు చెందిన 21వ సీడ్ బెన్ షెల్టన్ కూడా క్వార్టర్ ఫైనల్లో విజయం సాధించి ముందంజ వేశాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్) సెమీ ఫైనల్‌కు చేరుకుంది. అమెరికా క్రీడాకారిణి మాడిసన్ కీస్ కూడా క్వార్టర్ ఫైనల్ పోరులో జయ-భేరి మోగించింది. బుధవారం 8వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సిన్నర్ అలవోక విజయాన్ని అందుకున్నాడు. పూర్తి ఆధిపత్యం చెలాయించిన సిన్నర్ 63, 62, 61తో మినార్‌ను మట్టికరిపించాడు. ఆరంభం నుంచే సిన్నర్ దూకుడును ప్రదర్శించాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ముందుకు సాగాడు. కళ్లు చెదిరే షాట్లతో విరుచుకు పడిన సిన్నర్ ఏ దశలోనూ మినార్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. ఇదే క్రమంలో వరుసగా మూడు సెట్లు గెలిచి సెమీస్‌కు చేరుకున్నాడు. ఉత్కంఠభరితంగా సాగిన మరో క్వార్టర్ ఫైనల్లో షెల్టన్ జయకేతనం ఎగుర వేశాడు. ఇటలీ ఆటగాడు సొనెగోతో జరిగిన హెూరాహెూరీ సమరంలో షెల్టన్ 64, 75, 46, 76తో విజయం సాధించాడు. ప్రారంభం నుంచే పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. ఇటు షెల్టన్ అటు సొనెగో సర్వం ఒడ్డి పోరాడారు. దీంతో పోటీలో ఉత్కంఠ తప్పలేదు. కానీ షెల్టన్ నిలకడైన ఆటను కనబరుస్తూ తొలి రెండు సెట్లను కైవసం చేసుకున్నాడు. మూడో సెట్‌లో సొనెగో పైచేయి సాధించాడు. కానీ నాలుగో సెట్‌లో మళ్లీ షెల్టన్ విజృంభించాడు. టైబ్రేకర్ వరకు సాగిన సెట్‌లో విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లాడు.

### ఇగా అలవోకగా..

మహిళల సింగిల్స్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణి స్వియాటెక్ అలవోక విజయంతో సెమీ-స్‌కు చేరుకుంది. అమెరికాకు చెందిన ఎమ్మా నవారొతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 31, 62తో సునాయాస విజయం సాధించింది. ఆరంభం నుంచే ఇగా దూకుడుగా ఆడింది. ఆమె ధాటికి ఎమ్మా ఎదురు నిలువలేక పోయింది. పూర్తి ఆధిపత్యం చెలాయించిన ఇగా ఎలాంటి ప్రతిఘటన లేకుండానే మొదటి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో కూడా ఇగా ఆధిపత్యం చెలాయించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుని ముందంజ వేసింది. మరో పోటీలో కీస్ చెమటోడ్చి విజయం సాధించింది. ఎలినా స్విటోలినా (ఉక్రెయిన్)తో జరిగిన పోరులో కీస్ 36, 63, 64తో జయకేతనం ఎగుర వేసింది. తొలి సెట్‌లో స్విటోలినా ఆధిపత్యం చెలాయించింది. దూకుడుగా ఆడుతూ అలవోకగా సెట్‌ను సొంతం చేసుకుంది. కానీ తర్వాత కీస్ పుంజుకుంది. అద్భుత ఆటతో స్విటోలినాను హడలెత్తించింది. ఇదే క్రమంలో వరుసగా రెండు సెట్లు గెలిచి సెమీస్ బెర్త్‌ను సొంతం చేసుకుంది.

# మీరు ఎప్పుడు నిద్ర పోతారు?

## ఇంటర్వ్యూ మధ్యలో డాడీ జకోవిచ్ ఆన్‌డ్యూటీ

**మెల్‌బోర్న్:** టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ మరో గ్రాండ్ స్లామ్ విజయం సాధించే దిశ గా సాగుతున్నాడు. క్వార్టర్స్‌లో మూడో సీడ్ కార్లోస్ అల్కరాజ్‌పై అద్భుత విజయం సాధించాడు. అయితే, మ్యాచ్ విజయం అనంతరం ఓ వైపు ఇంటర్వ్యూ ఇస్తూనే.. ఇద్దరు పిల్లలకు తండ్రిగా తన బాధ్యతను నిర్వర్తించా డు. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అసలేం జరిగిందంటే? ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెర్బియా ఆటగాడు నొవాక్ జకోవిచ్ సెమీఫైనల్‌కు చేరాడు. క్వార్టర్స్‌లో కార్లోస్ అల్కరాజ్‌పై పోరాడి విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌ను నొవాక్ భార్య జెలెనాతోపాటు కుమారుడు స్టీఫె న్, కుమార్తె తార వీక్షించారు. తొలి మ్యాచ్ మొదటి పాయింట్ సాధించగానే స్టీఫెన్ సంబరాలు చేసుకుంటూ ఆనందించాడు. మ్యాచ్ అనంతరం జకోవిచ్ బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతుండగా.. గ్యాలరీలో ఉన్న కుమారుడు, కుమార్తెను చూసిన సమాధానం మధ్యలోనే ఆపేశాడు. వారు నిద్రపోయే సమయం దాటిపోయిందని చెబుతూ.. "నా పిల్లలు ఇక్కడే ఉండటం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఐ లవ్‌యూ. నాకు మద్దతుగా వచ్చినందుకు ధన్యవాదాలు. అయితే, ఇప్పుడు సమయం రాత్రి ఒంటి గంట. ఇక మీరు ఎప్పుడు నిద్ర పోతారు?' అని జకోవిచ్ వ్యాఖ్యానించాడు. ఆ మాటలకు అతడి పిల్లలే కాకుండా.. అభిమానులూ నవ్వులు చిందించారు. జకోవిచ్-అల్కరాజ్ మధ్య క్వార్టర్స్ మ్యాచ్ దాదాపు 3 గంటల 37 నిమిషాల పాటు సాగింది.

# దేవ్‌రాజ్‌కు కేకే అభినందనలు

జగన్ మోహన్‌రావు నేతృత్వంలోని హెచ్‌సీఏ కార్యవర్గాన్ని ప్రశంసించిన కాంగ్రెస్ సీనియర్ నేత



**ప్రజానావ, హైదరాబాద్:** వచ్చే నెలలో జరగనున్న ప్రతిష్టాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే టీమిండియాకి మేనేజర్‌గా నియమితులైన హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవ్‌రాజ్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కే.కేశవరావు అభినందించారు. బుధవారం కేశవరావును ఆయన నివాసంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిశనపల్లి జగన్ మోహన్ రావు, కార్యదర్శి దేవ్ రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీసీఐ దేవ్‌రాజ్‌ను టీమిండియాకు మేనేజర్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. జగన్ మోహన్‌రావు అధ్యక్షతన కొత్త కార్యవర్గం ఏర్పాటైన తర్వాత హెచ్‌సీఏ పనితీరు మెరుగుపడిందని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి సభ్యులంతా ఒకతాటిపై కలిసి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

# ఛాంపియన్స్ ట్రోఫీ జెర్సీ వివాదం..

## స్పందించిన ఐసీసీ!

**ముంబై:** ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. దీనికి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. అయితే, అక్కడికి వెళ్లేది లేదని బీసీసీఐ తేల్చి చెప్పడంతో టీమ్‌ఇండియా ఆడే మ్యాచులు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. చాన్నాళ్లపాటు తీవ్ర స్థాయిలో చర్చలు జరిగిన అనంతరం ఈ సమస్య ఓ కొలిక్కి వచ్చింది. ఇప్పుడు మరో వివాదం చోటు చేసుకున్నట్లుంది. ఆటగాళ్ల జెర్సీల మీద ఆతిథ్య దేశం పేరు ఉండడంపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇందుకు అంగీకరించమని స్పష్టం చేసింది. దీనిపై తాజాగా ఐసీసీ కూడా స్పందించింది. "టోర్నమెంట్‌కు సంబంధించిన లోగోను ప్రతి జట్టూ తమ జెర్సీకి యాడ్ చేసుకోవాలి. అన్ని జట్లూ ఈ నిబంధనను పాటించాల్సిన అవసరం ఉంది" అని ఐసీసీ అధికార వర్గాలు స్పష్టం చేశాయి. మరోవైపు బీసీసీఐపై పీసీబీ కూడా తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. క్రికెట్‌లోకి రాజకీయాలను తెస్తోందని ఆరోపించింది. "బీసీసీఐ క్రికెట్లోకి రాజకీయాలను తెస్తోంది.




దాని వల్ల ఆటకు నష్టం జరుగుతోంది. ముందు వాళ్లు పాకిస్థాన్‌కు జట్టును పంపడానికి తిరస్కరించారు. ఆరంభోత్సవానికి కెప్టెన్‌ను కూడా పంపట్లేదు. ఇప్పుడేమో టీమ్‌ఇండియా జెర్సీలపై ఆతిథ్య దేశం (పాకిస్థాన్) పేరు వద్దంటున్నారు" అని ఓ పీసీబీ అధికారి అన్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఇప్పటికి ఏడు జట్లు తమ స్క్వాడ్‌లను ప్రకటించాయి. ఆతిథ్య పాక్ మాత్రం ఇంకా వెల్లడించలేదు. ఇప్పటికే గడువు (జనవరి 19) కూడా ముగిసింది. ఇంకా తమ స్క్వాడ్‌ను ప్రకటించకపోవడంపై పాక్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ తీవ్ర స్థాయిలో స్పందించాడు. "పాకిస్థాన్ జట్టును ప్రకటించేందుకు భయపడుతోందా? అలా జరగదని భావిస్తున్నా. కానీ,ఎందుకు ఆలస్యమయిందో? తెలియడం లేదు. సైమ్ అయూబ్ ఫిట్‌నెస్ కోసం ఎదురు చూస్తున్నట్లుంది. పాక్‌కు టాప్ ఆర్డర్ కంటే మిడిలార్డర్‌తోనే సమస్య ఎక్కువగా ఉంది. 140 కి.మీ వేగంతో వచ్చే బంతులను ఎదుర్కోవాలి. భారత్‌కు నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. వారిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవేళ అయూబ్ అందుబాటులో లేకపోతే సెలక్టర్లు ఏం చేస్తారనేది ఆసక్తికరంగా మారింది" అని బసిత్ అలీ వ్యాఖ్యానించాడు.




# గత కీర్తి ఎల్లవేళలా వెంటరాదు..

## ప్రస్తుత ఫామే కీలకం : సీనియర్లపై కపిల్ దేవ్

**న్యూఢిల్లీ:** గతంలో ఎంత సాధించినా.. క్రికెటర్లకు ప్రస్తుత ఫామే అత్యంత కీలకమంటూ భారత దిగ్గజం కపిల్ దేవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రోహిత్, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ బ్యాటర్లు ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ రంజీ బరిలోకి దిగబోతున్నవేళ కపిల్ ఈ వ్యాఖ్యలు చేశాడు. గత కీర్తితో ఎల్లవేళలా కొనసాగలేమని, నాణ్యమైన ఆటతీరు ప్రదర్శిస్తూనే ఉండాలని సూచించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును ఇటీవల బీసీసీఐ ప్రకటించింది. అంతకుముందు ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో రోహిత్, విరాట్ దారుణంగా విఫలమయ్యారు. సీనియర్లు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడటంపైనా ఒకదశలో అనుమానాలు వచ్చాయి. అయితే, వారికి ఛాన్స్ దక్కింది. ఈ క్రమంలో సీనియర్లకు కపిల్ దేవ్ పలు సూచనలు చేశాడు. "బ్యాటింగ్ లేదా బౌలింగ్‌లో మరిన్ని ఆప్షన్లు ఉన్నప్పుడు ఫామ్‌లో ఉన్నవారితోనే ఆడాలి. ఎందుకంటే గత కీర్తి ఆధారంగా ఎక్కువకాలం కొనసాగలేం. ఇప్పుడున్న ఫామే అత్యంత కీలకం. ఎంతటి గొప్ప ప్లేయరైనా వరుసగా విఫలమవుతున్నా అవకాశాలు ఇవ్వడంలో అర్థం లేదు. ఒకవేళ కుర్రాళ్లే అలాంటి పరిస్థితుల్లో ఉంటే ఛాన్స్‌లు ఇవ్వరుగా. అదే సీనియర్ల విషయంలో ఎందుకు పాటించరు? సెలక్షన్ ప్రక్రియ ఆరోగ్యకరమైన వాతావరణంలో జరగాలి. ఫామ్‌లో లేని కోహ్లీ స్థానంలో కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాల్సింది. అయితే, ఇప్పుడు మరోసారి అతడికి ఛాన్స్ వచ్చింది. ఇప్పుడైనా 'అవును నేను ప్రపంచంలోనే నంబర్‌వన్ ప్లేయర్‌గా ఉన్నా. ఇప్పుడు ఆ స్థాయికి తగ్గట్టుగా ఆడాలి' అని అనుకోవాలి. అప్పుడు అతడితోపాటు జట్టుకూ ప్రయోజనం" అని కపిల్ వెల్లడించాడు.

### దుబాయ్‌లో వారిద్దరే కీలకం : కైఫ్

"ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజయం సాధించాలంటే సీనియర్లు రోహిత్, విరాట్ కోహ్లీ రాణించడం అత్యంత ముఖ్యం. వీరిద్దరూ మరింతకాలం ఆడకపోవచ్చు. ఈ ఐసీసీ టోర్నీనే చివరిది కావొచ్చు. వారు తమ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించాలి. దుబాయ్‌లో వీరిద్దరే కీలకం. రోహిత్ శర్మ దూకుడైన ఆరంభం అందించాలి. కోహ్లీ దానిని ముందుకు తీసుకెళ్లాలి. గతంలోనూ ఇలాంటి ఆటతీరును చూశాం" అని భారత మాజీ క్రికెటర్ కైఫ్ వెల్లడించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచులన్నీ దుబాయ్ వేదికగానే జరుగుతాయి. ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో టీమ్‌ఇండియా తలపడనుంది. ఈ గ్రూప్‌లో బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఇతర జట్లుగా ఉన్నాయి.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





## ఆ హిట్ సినిమాకు సీక్వెల్ సిద్ధం: అనిల్ శర్మ

సన్నీ దేవోల్ కథానాయకుడిగా అనిల్‌శర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గదర్ 2'. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అంచనాలకు మించి విజయం సాధించింది. రూ.60 కోట్లతో నిర్మించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.500 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఫలితంగా దీనికి సీక్వెల్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అనిల్ శర్మ తాజా చిత్రం 'వనవాస్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గదర్ 3' గురించి అప్‌డేట్ పంచుకున్నారు. అలాగే 'గదర్ 3'లో నానా పటేకర్ విలన్‌గా కనిపిస్తారనే వార్తలపై స్పందించారు. "గదర్ 3' కచ్చితంగా ఉంటుంది. దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం నేను 'వన్‌వాస్'తో బిజీగా ఉన్నాను. ఇది విడుదలైన తర్వాత 'గదర్ 3'ని ముమ్మరం చేస్తాం. త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తాం. నేను నానాపటేకర్‌తో దీనిపై చర్చించాను. అతడు ఈ ప్రాజెక్టులో భాగం కావచ్చు. లేదంటే అతడి కోసం ఓ పాత్రను సృష్టించడానికైనా నేను సిద్ధమే" అన్నారు.

## జయలలిత బయోపిక్.. అందుకే చేయలేదు : నిత్యామేనన్

దివంగత నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పటికే సినిమా, వెబ్ సిరీస్‌లు విడుదలై ప్రేక్షకులను అలరించాయి. నిత్యామేనన్ కథానాయికగా ప్రియదర్శిని అనే యువ దర్శకురాలు జయలలిత బయోపిక్ చేస్తున్నట్లు 2019లో ప్రకటించారు. 'ది ఐరన్ లేడీ' అంటూ టైటిల్ పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ సినిమా గురించి తాజాగా నిత్యామేనన్ స్పందించారు. సినిమా ప్రకటించి సుమారు ఐదేళ్లు దాటుతున్నా ఎటువంటి అప్‌డేట్ లేకపోవడంపై ఆమె మాట్లాడారు.'జయలలిత బయోపిక్ చేయాలని మేము ఎంతగానో ఆశపడ్డాం. చర్చలు కూడా జరిగాయి. మా సినిమా ప్రకటించిన తర్వాత అదే కథతో 'తలైవి' అనే చిత్రం వచ్చింది. మళ్లీ సినిమా చేస్తే రిపీట్ అవుతుందనిపించింది. మా నాన్న మాత్రం.. తప్పకుండా ఆ సినిమాలో యాక్ట్ చేయమని కోరారు. కొంతకాలానికి 'క్వీన్' పేరిట ఒక వెబ్ సిరీస్ కూడా వచ్చింది. అలా, ఒకే కథపై రెండు ప్రాజెక్టులు విడుదలయ్యాక.. మేము సినిమా చేస్తే రిపీట్ చేసినట్లు అవుతుందని భావించా. అందుకే ఆ సినిమా పక్కన పెట్టేశా' అని చెప్పారు. ఇండస్ట్రీలో రాణించడంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. 'నాకు సినీరంగం అంటే ఇష్టం లేదు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవితాన్ని ఆస్వాదించాలనేది నా కోరిక. అవకాశం వస్తే వేరే రంగానికి వెళ్లాలని కూడా ప్రయత్నించా. కానీ, జాతీయ అవార్డు నా ఆలోచనల్ని తిప్పికొట్టింది. ఉత్తమ నటిగా నాకు దక్కిన ఈ పురస్కారం నేనేంటో నిరూపించి.. నా జీవితానికి ఓ మార్గాన్ని చూపించింది' అని ఆమె అన్నారు. నిత్యామేనన్ నటించిన తాజా చిత్రం 'కాదలిక్క నెరమిల్లై'. జయంరవి ప్రధాన పాత్రలో నటించారు. జనవరి 14న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె 'ఇడ్లీ కడై' కోసం వర్క్ చేస్తున్నారు. ధనుష్ స్వీయ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది.





## 'సంక్రాంతికి వస్తున్నాం'
### ఏడు రోజులు.. రూ.203 కోట్లు..


వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతోంది. విడుదలై వారం రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.203ం కోట్లు వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ ఏడాది పెద్ద పండగకు వచ్చిన సినిమాల్లో చివరన విడుదలైన ఈ చిత్రం వసూళ్లలో మాత్రం అన్నింటి కంటే ముందు ఉంది. ముఖ్యంగా ఫ్యామిలీ ప్రేక్షకులు సినిమా చూసేందుకు థియేటర్‌కు క్యూ కడుతున్నారు. అమెరికాలోనూ 'సంక్రాంతికి వస్తున్నాం' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటివరకూ 2.3 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసింది. వెంకటేశ్, అనిల్ రావిపూడి, వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. సంక్రాంతి సెలవులు పూర్తయినా తెలుగు రాష్ట్రాల్లో ఈ మూవీకి ఆక్యుపెన్సీ ఏమాత్రం తగ్గడం లేదు. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్'కే కేటాయించిన చాలా స్క్రీన్‌లలో ఈ మూవీని ప్రదర్శిస్తున్నారు. మరోవైపు ఈ వారం కూడా బాక్సాఫీస్ వద్ద క్రేజీ చిత్రాలేవీ లేకపోవడం వెంకటేశ్ మూవీకి కలిసొచ్చే అంశం. ఇప్పటివరకూ వెంకటేశ్ నటించిన చిత్రాల్లో అత్యధిక గ్రాస్ కలెక్షన్స్ మూవీ అంటే 'ఎఫ్2' ఉండేది. ప్రపంచవ్యాప్తంగా ఆ మూవీ రూ.132 కోట్లు కలెక్ట్ చేసింది. అయితే, అందులో వరుణ్ తేజ్ కూడా మరో హీరోగా ఉన్నారు. సోలో హీరోగా వెంకటేశ్ రూ.100 కోట్లు వసూలు చేసిన సినిమాగా ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' రికార్డు సృష్టించింది. తెలుగు సీనియర్ హీరోల్లో రూ.200 కోట్లు వసూలు చేసిన నటుల్లో చిరంజీవి (సైరా, వాల్తేర్ వీరయ్య) తర్వాత ఈ రికార్డును అందుకున్న నటుడిగా వెంకటేశ్ రికార్డు సృష్టించారు. ఇక భీమ్స్ సిసిరోలియో అందించిన పాటలు కూడా అలరిస్తున్నాయి. 'గోదారి గట్టు' సాంగ్ యూట్యూబ్‌లో టాప్-100 మ్యూజిక్ వీడియోల్లో నెంబర్1లో ఉంది. ఇప్పటివరకూ 121 మిలియన్ వ్యూస్‌తో ఈ సాంగ్ దూసుకుపోతోంది.






## నాగశౌర్య కొత్త సినిమా..

నటుడు నాగశౌర్య ఇటీవల నటించిన వరుస చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైన విషయం తెలిసిందే. దీంతో సరైన సక్సెస్ అందుకోవడం కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన వరుస ప్రాజెక్టులు ఓకే చేశారు. ఆయన కథానాయకుడిగా రామ్ దేసిన దర్శకత్వంలో కొత్త సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. బుధవారం నాగశౌర్య పుట్టినరోజును పురస్కరించుకొని చిత్రబృందం టైటిల్ పోస్టర్ విడుదల చేసింది. ఈ చిత్రానికి 'బ్యాడ్ బాయ్ కార్తిక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా విభిన్నమైన కథతో దీనిని తెరకెక్కిస్తున్నారు. శౌర్య యాంగ్రీ లుక్‌లో కనిపించారు. వైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై ఈ సినిమా నిర్మితమవుతోంది. ఈ చిత్రానికి హరీశ్ జయరాజ్ స్వరాలు అందిస్తున్నారు. మరోవైపు నాగశౌర్య హీరోగా 'పోలీసు వారి హెచ్చరిక', 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాలు ఉన్నాయి.



## వీల్‌చైర్‌లో రష్మిక..

స్టార్ హీరోయిన్ రష్మిక ఇటీవల గాయపడిన విషయం తెలిసిందే. జిమ్‌లో వర్కౌట్లు చేస్తుండగా ఆమె కాలికి గాయమైంది. తాజాగా ఆమె హైదరాబాద్ విమానాశ్రయంలో వీల్‌ఛైర్‌లో కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన హిందీ చిత్రం ప్రచారంలో పాల్గొనడం కోసం ముంబయి బయల్దేరినట్లు తెలుస్తోంది. కారులో ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న రష్మిక తన టీమ్ సాయంతో వీల్‌ఛైర్‌లో విమానాశ్రయం లోపలికి వెళ్లారు. ఈ వీడియో చూసిన అభిమానులు ఆమె త్వరగా కోలుకోవాలంటూ కామెంట్స్ పెడుతున్నారు. తనకు గాయమైనట్లు తెలుపుతూ ఇటీవల రష్మిక ఓ పోస్ట్ పెట్టారు. "పూర్తిగా ఎప్పుడు కోలుకుంటానో ఆ భగవంతుడికే తెలియాలి. త్వరగా కోలుకుని 'సికందర్', 'థామ', 'కుబేర' సెట్స్‌లో పాల్గొనాలని ఆశిస్తున్నా. ఈ ఆలస్యాన్ని క్షమించాలని ఆయా చిత్రాల దర్శకులను కోరుతున్నా. నా కాలు ఏమాత్రం సెట్ అయినా వెంటనే షూట్‌లో భాగం అవుతా" అని దానిలో తెలిపారు.

## ఐటీ సోదాలపై స్పందించిన నిర్మాత దిల్‌రాజు

**హైదరాబాద్:** నగరంలోని పలువురు సినీ ప్రముఖుల ఇళ్లపై జరుగుతున్న ఆదాయ పన్నుశాఖ (ఐటీ) దాడులపై నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ (టీజీఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్‌రాజు స్పందించారు. ఐటీ సోదాలు తన ఒక్కడిపైనే జరగడం లేదని అన్నారు. ఇండస్ట్రీ మొత్తం మీద ఐటీ సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాకు అభివాదం చేస్తూ పై వ్యాఖ్యలు చేశారు. రెండో రోజు కూడా సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ శాఖ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దిల్ రాజు నివాసాలు, కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా కార్యాలయాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. నిర్మాణ సంస్థల ఆదాయం, పన్ను చెల్లింపు మధ్య తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పలు సంస్థలకు చెందిన వ్యాపార లావాదేవీల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకర్లను కూడా ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పలు పత్రాలను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు చేశాకే సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 55 బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. సంక్రాంతికి భారీ బడ్జెట్‌తో సినిమాలు తెరకెక్కించిన నేపథ్యంలో దిల్ రాజు నివాసంలో సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం.. సినిమాల నిర్మాణానికి భారీగా వెచ్చించినట్లు చెబుతున్నారు. ఈ రెండు చిత్రాల కలెక్షన్ల నేపథ్యంలో తనిఖీలకు ప్రాధాన్యం సంతరించుకొంది.




## ఒక్కోసారి మౌనంగా ఉండడం కూడా మంచిదే : రామ్ గోపాల్ వర్మ



రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'సర్కార్'. 2005లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిం చింది. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామ్ గోపాల్ వర్మ ఈ సినిమాను గుర్తుచేసుకున్నారు. అమితాబ్ వల్ల అందులోని ఓ సన్నివేశం అద్భు తంగా వచ్చిందన్నారు. కొందరు నటీనటులు వారి నటనతో సన్నివేశాలను మరోస్థా యికి తీసుకెళ్తారన్నారు. 'సర్కార్'లో అమితాబ్ తన కుమారుడిని బయటకు వెళ్లమనే సందర్భం వస్తుంది. ఆ సన్నివేశాన్ని ఎలా చేయాలనే దానిపై నాకు, అమితాబ్‌కు మధ్య భిన్నాభిప్రాయాలు వచ్చాయి. కోపంగా అరిచి చెప్పాలని నేను సూచించాను. సర్కార్ అందరిలాంటి తండ్రి కాదు కాబట్టి మరోలా చేయాలని అమితాబ్ చెప్పారు. అంతగొప్ప నటుడితో వాదించడం ఇష్టంలేక నేను మౌనంగా సరే అన్నాను. మరుసటి రోజు రీషూట్ చేద్దామని చెప్పా. ఆరోజు రాత్రి 11 గంటలకు అమితాబ్ నాకు ఫోన్ చేశారు. 'నేను అనుకున్న విధానం కంటే నువ్వు చెప్పిందే బాగుంది. రేపు అలానే రీషూట్ చేద్దాం' అన్నారు. తర్వాత రోజు ఆ సన్నివే శాన్ని రీషూట్ చేశాం. ఆ సీన్‌లో అమితాబ్ అద్భుతంగా నటించారు. నటుడికి, దర్శకుడికి మధ్య అనుబంధం ఎంత గొప్పగా ఉంటుందనేదానికి ఇది ఉదాహరణ. అవతలి వారి ఆలోచనలు మనకు నచ్చకపోతే కొన్నిసార్లు మౌనంగా ఉండాలి. అలా వాదిం చకుండా మౌనంగా ఉండడం వల్ల కూడా పరిస్థితులు మనకు అను కూలంగా మారతాయని అర్థం చేసుకున్నా" అని చెప్పారు. తాను ఆశించిన దానికి మించి అమితాబ్ నటించారని వర్మ ప్రశంసించారు. ఇక 'సర్కార్'లో అభిషేక్ బచ్చన్ కూడా నటించారు. అది సూపర్ హిట్ కావడంతో దానికి సీక్వెల్‌గా 'సర్కార్ రాజ్' రూపొందించారు. ఇందులో అమితాబ్, అభిషేక్‌లతో పాటు ఐశ్వర్యారాయ్ కూడా నటించారు. 2008లో విడుదలైన ఈ సీక్వెల్ కూడా విజయాన్ని అందుకుంది.

## బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్.. ఓటీటీనే ప్రధాన కారణం : అక్షయ్ కుమార్

చిత్ర పరిశ్రమలో బాక్సాఫీస్ సక్సెస్ రేటు తగ్గడంపై బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓటీటీ వల్లే సినిమాలు థియేటర్లలో ఆడటం లేదని ఆయన తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. "ఈ మధ్యకాలంలో నేను చాలామందితో సినిమాల గురించి మాట్లాడాను. ఏదైనా సరే తాము ఓటీటీలో చూస్తామని వారు అన్నారు. బాక్సాఫీస్ వద్ద సినిమాలు సరిగ్గా ఆడకపోవడానికి ప్రధాన కారణం అదే. కొవిడ్ సమయంలో ప్రజలందరూ ఓటీటీ వేదికగా ఇంట్లో కూర్చొని సినిమాలు చూశారు. ఆ తర్వాత పరిస్థితులు ఎంతో మారినప్పటికీ వారు మాత్రం ఓటీటీకే మొగ్గు చూపిస్తున్నారు. అది వాళ్లకు ఒక అలవాటుగా మారింది" అని అక్షయ్ అన్నారు. కంటెంట్ ఎంపిక విషయంలో తాను ఎంతో జాగ్రత్తగా ఉంటున్నానని అక్షయ్ చెప్పారు. "కొవిడ్ వల్ల చిత్రపరిశ్రమలో ఎన్నో మార్పులు వచ్చాయి. అందులో ఎలాంటి సందేహం లేదు. ఏ చిత్రాలు వీక్షించాలనే విషయంలో ప్రేక్షకులు చాలా క్లియర్‌గా ఉంటున్నారు. పూర్తిగా వినోదాత్మక, విభిన్నమైన ప్రాజెక్ట్‌లను ఎంచుకోవడం చాలా కీలకం. నేను కూడా ఆ విషయంలో మరింత శ్రద్ధ వహిస్తున్నాను. ప్రస్తుత కాలానికి అనుగుణంగా.. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే సినిమాలను మాత్రమే ఎంచుకుంటున్నా" అని తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో ఆయన 'భూల్ భూలయ్యా 2, 3'లో నటించకపోవడంపై స్పందించారు. ఆయా ప్రాజెక్ట్‌ల నుంచి తనని తొలగించారని అన్నారు. అక్షయ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న తాజా చిత్రం 'స్కై ఫోర్స్'. సారా అలీఖాన్, వీర్ పహారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సందీప్ కేవ్లానీ దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జనవరి 24న ఇది విడుదల కానుంది. ఇటీవల రిలీజైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. మరోవైపు, అక్షయ్‌కుమార్ ప్రస్తుతం 'కన్నప్ప', 'స్త్రీ 3' ప్రాజెక్ట్‌ల కోసం కూడా వర్క్ చేస్తున్నారు.



Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**